దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు

కెరమెరి, మే 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం గోండ్‌గూడ, ఇందాపూర్, ఝరి, మోడి గ్రామాలోని రాజీవ్ యువ వికాస పథకం దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. అర్హులను ఎంపిక చేస్తామని అధికారులు తెలిపారు. కార్యక్ర మంలో ప్రత్యేకాధికారి వెంకట్, ఎంపీడీఓ అంజద్‌పాషా, బీసీ వెల్ఫేర్ అధికారి గణ పతి, టీజీబీ మేనేజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌రూరల్, (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజీవ్ యువ వికాస పథ కం దరఖాస్తుల పరిశీలన కొనసాగుతోంది. మంగళవారం సాలెగూడ, తుంపల్లి, మణిక్‌గూడ లబ్ధిదారులకు మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు దరఖా స్తుల పరిశీలన, ఎంపిక నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్ తదిత రులు పాల్గొన్నారు.

దహెగాం, (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం చంద్ర పల్లి, బామానగర్, కల్వాడ, కుంచెవెల్లి గ్రామాల్లో రాజీవ్ యువవ వికాసం పథకం దరఖాస్తుదా రులకు ఇన్‌చార్జి ఎంపీడీవో ఆల్బర్ట్ ఆధ్వర్యంలో మంగళవారం ఇంట ర్వ్యూలు నిర్వహించారు. 129 మంది దర ఖాస్తులను పరిశీలించారు. నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం చంద్రశేఖర్, టీజీబీ మేనేజర్, ఎంపీవో రవి పాల్గొన్నారు.

చింతలమానేపల్లి, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో రాజీవ్ యువ వికాసం కోసం దరఖాస్తు చేసుకున్నవారికి ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, ఆధ్వర్యంలో అధికారుల బృందం సభ్యులు మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. కర్జెల్లి, బాబాపూర్, బూరెపల్లి తదితర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు. దరఖాస్తులు పరిశీలించి అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయనున్నట్లు ఈ సందర్భంగా ఎంపీడీవో తెలిపారు.

ముందుకు సాగని ఇందిరమ్మ ఇళ్లు

- జిల్లాకు 1,669 మంజూరు
- డబ్బులు లేక లబ్ధిదారుల అనాసక్తి
- కొన్ని చోట్ల స్థల వివాదంతో నిలిపివేత



గోవింద్‌పూర్‌లో పిల్లర్ల దశలో ఉన్న ఇందిరమ్మ ఇల్లు

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో భాగంగా పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభించింది. ఇల్లు నిర్మించుకోవడా నికి రూ. 5లక్షల ఆర్థిక సాయం మంజూరు చేయనున్నది. కానీ ప్రస్తుతం జిల్లాకు 1,669 మంజూ రైనా పనులు ముందుకు సాగని పరిస్థితి నెలకొంది.

ఆసిఫాబాద్‌రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల కోసం ఆర్భాటం ఎక్కువ చేసినా అ మలుకు వచ్చే సరికి లబ్ధిదారులు వెనుకంజ వేస్తున్నారు. ఇళ్ల కోసం వేల దరఖాస్తులు పెట్టుకున్నా ఆచరణలోకి వచ్చే సరికి పనుల్లో ఆసక్తి చూపడం లేదు. పాత పద్ధతుల్లో ఇళ్ల నిర్మాణం చేపడతారనే నమ్మకంతో పెద్ద సంఖ్యలో ప్రజలు దరఖాస్తు చేసుకున్నారు. నిబంధ నలు కఠినతరం చేయడంతో దరఖాస్తుదారులు అయోమయంలో పడ్డారు. సగం మంది సైతం ఇళ్ల నిర్మాణానికి ముందుకు రావడంలేదు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం అంటే చూసీచూడనట్లు ఉంటారనే ధీమా, మంజూరైతే చాలనే నమ్మకంతో భారీగా దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుతం రేకుల ఇల్లు ఉన్న వారు స్లాబ్ వేసుకోవచ్చని, ఉన్న ఇంటిని కొంత మేర బాగు చేయడం ద్వారా బిల్లులు మంజూరు చేసుకోవచ్చని భావించారు. స్థలం నిబంధనల ప్రకారం లేకున్నా కనికరిస్తారనే నమ్మకంతో ఉన్నారు. గతంలో ఇలాగే బిల్లులు పొందిన ఘటనలు ఉన్నాయి. అందుకే దరఖా స్తులు వేలాకు పైగానే వచ్చాయి. వాటిలో స్థల వివా దాలు, నిబంధనల ప్రకారం స్థలం సరిపోని వారు, రేకుల ఇల్లు ఉన్నవారి దరఖాస్తులను తిరస్కరించారు.

● జిల్లాలో మొదటి విడత..

కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాకు మొదటి విడతలో 1,669 ఇళ్ల మంజూరయ్యాయి. ఇందులో 890 ఇళ్లకు అధికారులు ముగ్గు పోసుకున్నారు. కేవలం 295 మం ది మాత్రమే పనులు ప్రారం భించారు. ఇంకా 779 మంది లబ్ధిదారులు పనులు ప్రారంభించలేదు. బేస్‌మెంట్ వరకు పనులు పూర్తి చేసిన 45 మందికి లక్ష రూపా యల చొప్పున జమయ్యాయి. రెండో విడతలో ఆసిఫా బాద్, సిర్పూర్ నియోజకవర్గాలకు 3,500 చొప్పున మొత్తం 7వేల ఇళ్లు మంజూరయ్యాయి. లబ్ధిదారుల జాబితాలో అధికారులు ఆయా మండ లాలు, గ్రామాల్లో వివరాలు సేకరిస్తున్నారు. పరిశీలన అనంతరం అర్హుల జాబితాను ప్రకటించనున్నారు.

● మండలానికి ఒకటి..

జిల్లాలోని 15 మండలాల్లో ఒక్కో గ్రామాన్ని ఇంది రమ్మ ఇళ్ల నిర్మాణాల కోసం ఎంపిక చేశారు. ఆయా గ్రామ పంచాయతీల్లో సైతం ఇళ్ల నిర్మాణాలు నత్తనడ కన సాగుతున్నాయి. ఆసిఫాబాద్, సిర్పూర్ మండ లాల్లో పనులు ప్రశ్నా ర్థకంగా మారాయి. ఆసిఫాబాద్ మండలం గోవింద్ పూర్‌ను పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారు. దేవాదాయశాఖకు చెందిన స్థలాల్లో ఇళ్లు నిర్మిస్తున్నారనే కారణంతో పనులు నిలిచిపోయాయి. సిర్పూర్ (టి) మండ లంలోని మేడిపల్లి, లింబు గూడ, రావణపల్లిలో సైతం ఇదే పరిస్థితి నెల కొంది. ఈ గ్రామాల్లో ఇళ్లు నిర్మించే స్థలాలు రిజర్వ్ ఫారెస్టు పరిధి లోకి వస్తుందని అటవీశాఖ అధికా రులు చెబు తున్నారు. పట్టా భూ ములేనని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. ఈ వివాదంతో ఇక్కడ సైతం పనులు సాగని పరిస్థితి నెల కొంది.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేస్తాం..

- వేణుగోపాల్, డీఈ హౌసింగ్

ఇందిరమ్మ ఇళ్ల పనులను వేగవంతం చేస్తాం. ముగ్గు పోయని లబ్ధిదారులకు అవగాహన కల్పించి పనులు ప్రారంభమయ్యేలా చూస్తాం. జిల్లాలోని ఆయా మండల కేంద్రాల్లో నిర్మిస్తున్న ఇందిరమ్మ నమూనా ఇళ్లను ఈ నెలఖరులోగా పూర్తి చేస్తాం.

భూ సమస్యల పరిష్కారమే ధ్యేయం



ధాన్యాన్ని పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ శ్రద్ధ శుక్లా

పెంచికలపేట, మే 6 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసమే భూ భారతి సదస్సులు నిర్వహిస్తున్నట్లు సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, అదనపు కలెక్టర్ డేవిడ్ అన్నారు. మండలంలోని దర్గపల్లి, చెడ్వాయి, ఆగర్‌గూడ గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన భూ భారతి సదస్సుల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 5 నుంచి 20 వరకు నిర్వహిస్తున్న భూ భారతి సదస్సుల్లో అర్జీదారుల నుంచి భూ సస్యల దరఖాస్తులు స్వీకరించనున్నామని చెప్పారు. వాటిని పరిశీలించి పరిష్కరిస్తామని తెలిపారు. దీనికి సంబంధించి మండలంలో మూడు బృందాలు ఏర్పాటు చేశామన్నారు. గ్రామసభకు రెండు రోజుల ముందే ప్రజలకు తెలిసేలా విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పెండింగ్ సాదాబైనామాలు పరిష్కరిస్తామని అన్నారు. దరఖాస్తుదారులకు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని అన్నారు. దరఖాస్తుల స్వీకరించి రసీదు జారీ చేయడంతో పాటు వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని తెలిపారు.అనంతరం చెడ్వాయి, ఎల్కపల్లి, ఎల్లూరు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్‌లు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల పరిశీలన

దహెగాం, మే 6 (ఆంధ్రజ్యోతి): దహెగాం మండలంలోని దహెగాం, లగ్గాం వరి కొనుగలు కేంద్రాలను మంగళవారం అదనపు కలెక్టర్ డేవిడ్, సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు, మిల్లర్లకు, సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. లగ్గాం పీపీసీ సెంటర్ నుంచి అనుమతి లేకుండా ధాన్యంను దహెగాంలోని ఓ రైస్ మిల్లుకు పంపించినందున సదరు పీపీసీ ఇన్‌చార్జి జీవన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యలు పునరావృతం అయితే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఆ ధాన్యం లారీ రైతులదా, దళారులదా విచారణ చేపట్టాలని ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారులను ఆదేశించారు. వారి వెంట తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు శ్రీనివాస్, రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

రైతుల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభం

దహెగాం, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతు వేదికలో క్లస్టర్ల వారీగా రైతుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైందని ఇన్‌చార్జి వ్యవసాయాధికారి రామకృష్ణ అన్నారు. మండలం కేంద్రంలో మంగళవా రం ఆయన మాట్లాడారు. రైతుల ఆధార్ కార్డు, జిరాక్స్ పట్టాదారు పాసుపుస్తకం, మొబైల్‌నంబర్ తీసుకు వచ్చి ఏఈవోలకు అందజేసి తమ వివరాలను రిజిస్ట్రేషన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. రైతులు గుర్తింపు కార్డులకు సంబంధించి రైతు రిజిస్ట్రేషన్‌లో తమ వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. పీఎం కిసాన్ పథకం ద్వారా లబ్ధి పొందుతున్న రైతులు తమ పేర్లు ఈ నెల 31 లోపు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవోలు వంశీ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

జనాభాకు అనుగుణంగా అవకాశాలు కల్పించాలి



మాట్లాడుతున్న బీసీ ఆజాదీ ఫెడరేషన్ అధ్యక్షుడు సంజయ్‌కుమార్

ఆసిఫాబాద్, మే 6 (ఆంధ్రజ్యోతి): బీసీలకు జనాభాకు అనుగుణంగా అవకాశాలు కల్పించాలని బీసీ ఆజాదీ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు జక్కని సంజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసిన 42 శాతం రిజర్వేషన్ బిల్లులు అమలు చేయాలని బీసీ ఆజాదీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన బీసీ మేల్కొలుపు రథయాత్ర మంగళవారం జిల్లా కేంద్రానికి చేరుకున్నది. ఈ సందర్భంగా విద్యా, ఉద్యోగ, వ్యాపార, రాజకీయ రంగాల్లో బీసీలకు జనాభా ప్రాతిపాదికన అవకాశాలను కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రమేష్, వెంకన్న, ప్రణయ్, సాయికుమార్, భాస్కర్, మధుసూదన్, లక్ష్మణరావు, శంకర్, బాలేష్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): బీసీ ఆజాదీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన బీసీ మేల్కొలుపు రథయాత్ర మంగళవారం రాత్రి కాగజ్‌నగర్‌కు చేరుకున్నది. కార్యక్రమంలో ప్రణయ్, గజ్జల లక్ష్మణ్, మాచర్ల శ్రీనివాస్, పొన్న రమేశ్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై అధికారులు స్పందించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, మే 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎక్కడైన తాగునీటి సమస్య ఉంటే అధికారులు తక్షణమే స్పందించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో మంగళవారం మిషన్ భగీరథ ఇంజనీర్లు, జిల్లా పంచాయతీ గ్రామీణాభివృద్ధి అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో జిల్లాలో తాగునీటి సరపరాపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తాగునీటి సమస్యలపై దినపత్రికలలో, ప్రసార సాధానాలలో వచ్చిన కథనాలపై అధికారులు స్పందించాలన్నారు. సమస్య పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. చేట్టిన చర్యల సమాచారాన్ని జిల్లా పౌర సంబంధాల అధికారి ద్వారా ప్రతికలలో వచ్చే విధంగా చూడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశాల మేరకు ప్రతి మండలంలో బుధవారం మిషన్ భగీరథ ఇంజనీర్లు, పంచాయతీ కార్యద ర్శులు, మండల పంచాయతీ అధికారులు, ఉపాధి హామీ సిబ్బందితో తాగునీటిపై మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో సమీక్ష నిర్వహించాలన్నారు. తాగునీటి సమస్యపై ప్రతి రోజు దిన పత్రికలలో వచ్చే ఫిర్యాదులపై స్పం దించాలని చెప్పారు. జిల్లాలోని 147 హబిటేషన్ లలో తాగునీటి సమస్య పరిష్కరించేందుకు ప్రత్యామ్నాయంగా నీటి ట్యాంకర్ల ద్వారా అందించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. మిషన్ భగీరథ మోటార్లు, పైపు లైన్ల లీకేజీ మరమ్మతులను యుద్ధ ప్రతిపాదికన చేపట్టాలన్నారు. గ్రామాలు, మున్సిపాలిటీలలో నీటిని వృథా చేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. తాగునీటిపై ప్రణాళిక ప్రకారం పనులు చేపట్టాలని, పంచాయతీ కార్యదర్శి తన పరిధిలో ప్రతి తాగునీటి వనరును సందర్శించి సమస్యలను గుర్తించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని, ఆదేశించారు. కార్యక్రమంలో డీపీవో భిక్షపతి, జిల్లాగ్రామీణాభివృద్ధి అధికారి దత్తారావు, జిల్లా పౌర సంబంధాల అధికారి సంపత్‌కుమార్, డీపీఓ ఉమర్ హుస్సేన్, మున్సిపల్ కమీషనర్లు భుజంగరావు, ఈఈ సిద్ధికి పాల్గొన్నారు.

పనులను వేగవంతం చేయాలి

ఆసిఫాబాద్, (ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు ప్రభుత్వం అంది స్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను జిల్లాలో వేగవంతం చేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలో మంగళవారం ఇందిరమ్మ ఇళ్ల పనులు, లబ్ధిదారుల జాబితాపై హౌసింగ్ పీడీ, ఇంజనీర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా పైలట్ గ్రామాల్లో ఎంపిక చేసిన లబ్ధిదారులు పనులను ప్రారంభించే విధంగా ఇంజనీర్లు చర్యలు తీసుకోవాలని చెప్పారు. బేసిమెంట్ లెవల్ వరకు పూర్తి చేసిన లబ్ధిదారుడి వివరాలు నమోదు చేసి మొదటి విడత నిధులు అందించాలని సూచించారు. ఇళ్ల నిర్మాణంలో సమస్యలు తలెత్తినట్లయితే హౌసింగ్ అధికారులు పరిష్కరించే దిశగా కృషి చేయాలని తెలిపారు. జిల్లాకు నూతనంగా ఒప్పంద పద్ధతిన హౌసింగ్ శాఖకు ఇంజనీర్లు వచ్చారని అన్నారు. జాబితాలో అన ర్హులు ఉంటే పంచాయతీ కార్య దర్శిపై పరిశీలన జరిపి చర్యలు తీసుకుం టామని తెలిపారు. సమావేశం హౌసింగ్ పీడీ వేణుగోపాల్, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

తేనెటీగల దాడిలో ఒకరి మృతి

రెబ్బెన, మే 6 (ఆంధ్రజ్యోతి): కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా గోలేటి-1భూగర్భ గని సమీపంలో మంగళవారం తేనెటీగలు దాడి చేయడంతో పుప్పాల నర్సయ్య(58) అనే కూలీ మృతి చెందాడు. గోలేటిలో గోడ పనులు చేసేందుకు మంచిర్యాల జిల్లా తాండూర్ మండలం మాదారం టౌన్ షిప్‌కు చెందిన పుప్పాల నర్సయ్య, ఎం శ్రీనివాస్, హెచ్ దుర్గారావు, ఎం ఫైడిధర్ మంగళవారం వెళ్లారు. పని చేస్తున్న సమీపంలో ఉన్న చెట్టు నుంచి తేనెటీగలు లేచి నలుగురిపై దాడి చేశాయి. నలుగురికి తీవ్రగాయాలు కావడంతో స్థానికులు బెల్లంపల్లి ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ నర్సయ్య మృతి చెందాడు. శ్రీనివాస్, దుర్గారావు, ఫైడిధర్ అనే ముగ్గురు చికిత్స పొందుతున్నారు. నర్సయ్య భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.

ఖైరి(టి)లో వైద్య శిబిరం

వాంకిడి, మే 6(ఆంధ్రజ్యోతి): ఖైరి(టి) గ్రామంలో మంగళవారం హెచ్‌ఈవో రవి దాస్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. పలువురి రక్తనమునాలు సేకరించి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం సునంద, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి సన్మానం

వాంకిడి, మే 6(ఆంధ్రజ్యోతి): వాంకిడి మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థికి జాడి కార్తీక్ పదో తరగతి పరీక్షల్లో మండల టాపర్‌గా నిలవడంతో మంగళవారం జైత్వాన్ బుద్ధ విహార్‌లో బౌద్ధ సంఘం నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అశోక్ వినేష్, విజయ్, జయరాం, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే గౌరవం సాధ్యం



వృద్ధురాలికి అక్షరాలు నేర్పిస్తున్న ఉపాధ్యాయుడు రమేశ్

సిర్పూర్(టి), మే 6 (ఆంధ్రజ్యోతి): చదువుతోనే గౌరవం సాధ్యమని కాగజ్‌నగర్ మండలం చారిగాం గ్రామ ప్రభుత్వ ఉపాధ్యాయుడు సుందిళ్ల రమేష్ అన్నారు. అక్షర చైతన్య యాత్రలో భాగంగా మంగళవారం సిర్పూర్(టి) మండలం పూసుగూడ గ్రామంలో వయోవృద్ధులకు, నిరక్షరా స్యులకు చదువు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చీకటి బతుకులు మార్చా లంటే బడీడు పిల్లలందరిని నిత్యం పాఠశాలలకు పంపాలని సూచించారు. చదువు ఒక్కటే అందరి తలరాతలను మారుస్తుందన్నారు. చదువుకునే వయస్సులో పిల్లలను బాల కార్మికులుగా మా ర్చవద్దని, మద్యపానం, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఆరోగ్యవం తమైన జీవితంతో ప్రజలు ఆనందంగా ఉండా లన్నారు. పర్యావరణమే మనందరికి ప్రాణాలకు రక్షణ అన్నారు. బాల్య వివాహాలు చేయవద్దని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశ పెట్టే సంక్షేమ పథకాలను సద్విని యోగం చేసుకుంటూ మీ జీవితాలను మార్చుకోవాలన్నారు. అనంతరం తన మాట పాటల ద్వారా కంజర వాయిస్తూ ప్రజలకు అర్థమయ్యే సామాన్య భాషలో చైతన్య వంతం చేశారు. ఈ సందర్భంగా ఆయనను గ్రామస్థులు సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ పటేల్ లేతు పటేల్, పెగు పటేల్, మాజీ సర్పంచ్ బ్రహ్మయ్య, అంగన్‌వాడీ టీచర్ అయ్యూబాయి, భాగ్య లక్ష్మీ, ఆశా వర్కర్ సుజాత, కారోబార్ విలాస్, ఎఫ్ఏ బీంరావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా నివసిస్తున్న వారిని గుర్తించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

ఆసిఫాబాద్, మే 6 (ఆంధ్రజ్యోతి): దేశంలో అక్రమంగా నివసిస్తున్న పాకిస్తానీయులను గుర్తించాలని, వారిని స్వదేశానికి పంపించాలని మంగళవారం బీజేపీ నాయ కులు జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రేకు వినతిపత్రం అందజేశారు. ఈ సంద ర్భంగా బీజేపీ జిల్లా అధ్య క్షుడు శ్రీశైలం, వన్ నేషన్ వన్ ఎలక్షన్ జిల్లా కన్వీనర్ అరిగెల నాగేశ్వర్‌రావులు మా ట్లాడుతూ కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై దాడి చేసి హతమా ర్చిన ఉగ్రవాదుల ను ఎన్‌కౌంటర్ చేయాలని చెప్పారు. జిల్లాలో తప్పుడు పత్రాలతో అక్రమంగా నివసిస్తున్న పాకిస్తానీయులను గుర్తించి వారిని స్వదేశానికి పంపించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మల్లికార్జున్ యాదవ్, నాయకులు వెంకన్న, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరికలు

ఆసిఫాబాద్‌రూరల్, మే 6(ఆంధ్రజ్యోతి): అంకుశాపూర్ గ్రామానికి చెందిన 55 మంది బీజేపీ పార్టీలో చేరారు. వారికి పార్టీ జిల్లా అధ్యక్షు డు దోని శ్రీశైలం, వన్ నేషన్ వన్ ఎలక్షన్ జిల్లా కన్వీనర్ అరిగెల నాగేశ్వర్‌రావు పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో గ్రామానికి చెందిన రాము, ప్రభాకర్, సకారాం, గణపతి, మురళీ, యువత ఉన్నారు.

వంద రోజులు పని కల్పించాలి

కెరమెరి, మే 6(ఆంధ్రజ్యోతి): జాబ్‌కార్డు ఉన్న వారికి వంద రోజుల పని కల్పించాలని మండల ప్రత్యేకాధికారి వెంకట్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో మంగళవారం ఆయన ఎంపీడీవో అంజద్‌పాషా, ఏపీవో మల్లయ్యతో పాటు సమీక్ష నిర్వహించారు.

ప్రతి ఒక్కరూ ధ్యానం చేయాలి

కెరమెరి, మే 6 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ధ్యానం చేయాలని పూలాజీ బాబా భక్తుడు దాదారావు, మగాడే మహరాజ్ అన్నారు. గోయగాం గ్రామంలోని పూలాజీ బాబా ధ్యాన కేంద్రం వార్షికోత్సవ కార్యక్రమంలో మంగళవారం ఆయన మాట్లాడారు. పూలాజీ బాబా ఎప్పుడు ధ్యానం చేయాలని సూచించేవారని అన్నారు. ధ్యానంతోనే యావత్ మానవాళికి ముక్తి లభిస్తుందని తెలియజేసేవారని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మునీర్ అహ్మద్, భక్తులు జైవంత్ మహరాజ్, భగవంత్‌రావు, శ్యాంరావు, గ్రామ పటేల్ శంకర్, పాండురంగ్, బాపూజీ, ముకుంద్‌రావు, మొండయ్య, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఆసిఫాబాద్‌రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని చింతలమానేపల్లి, కెరమెరి మండలాలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని మంగళవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు దోని శ్రీశైలం ఆధ్వర్యంలో ఆయా మండలాల నాయకులు కలెక్టర్ వెంకటేష్ దోత్రేను కలిసి వినతిపత్రం అందజేశారు. తొలి సారిగా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి చెట్టును అందజేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్‌నాయక్, విజయ్‌కుమార్, తుకారాం, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

'ముఖ్యమంత్రి ప్రజలకు క్షమాపణ చెప్పాలి'

కాగజ్‌నగర్, మే 6 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పి గద్దెదిగాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. కాగజ్‌నగర్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారం కోసం ఎన్నికల్లో అమలు కాని హామీలను ఇచ్చారని చెప్పారు. బంగారు తెలంగాణను బంజరు తెలంగాణగా మార్చారని తెలిపారు. రాష్ట్రాన్ని పాలించలేక ఇప్పుడు చెతులెత్తేశారని, పరిపాలన చేతకాని రేవంత్ రెడ్డి ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

వేసవి క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి

దహెగాం, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నరాస్పెల్లి, కుంచవెల్లి, బీబ్రా, ఇట్యాల, దహెగాం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు వేసవి క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి ఎంఈవో శ్రీనివాస్ అన్నారు. కుంచవెల్లి పాఠశాలలో విద్యార్థులకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను మంగళవారం ఆయన పరిశీలించారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా నృత్యం, యోగా, కరాటే, పేపర్ కటింగ్, కుట్లు, అల్లికలు విద్యార్థులకు నేర్పుతున్నామని, ఈ క్యాంపు నెల 15 వరకు కొనసాగుతుందని తెలిపారు.

చోరీలకు పాల్పడుతున్న ఇద్దరి అరెస్టు



మాట్లాడుతున్న సీఐ రమేశ్, పాల్గొన్న ఎస్సై నరేశ్

కౌటాల, మే 6 (ఆంధ్రజ్యోతి): పలు చోట్ల చోరీలకు పాల్పడుతున్న ఇద్దరిని మంగళవారం అరెస్టు చేశామని కౌటాల సీఐ ముత్యం రమేశ్ అన్నారు. స్థానికంగా మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ మాట్లాడారు. చింతలమానేపల్లి మండలం రన్‌వెల్లి గ్రామ శివారులో ప్రాణహిత నది ఒడ్డున గల ఎత్తి పోతల పథకంకు చెందిన హెవీ మోటార్లలో రాగి తీగలను దొంగలిస్తున్న మహారాష్ట్ర చంద్రాపూర్ జిల్లాకు చెందిన ముఠాను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నామని చెప్పారు. గత నెల 28న ఎత్తిపోతల పథకంలో రాగి తీగ దొంగతనానికి గురైనట్లు లిఫ్టు ఇరిగేషన్ సూపర్‌వైజర్ శ్రీకాంత్ చింతలమానేపల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడని అన్నారు. ఈ ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టామని తెలిపారు. ఈ నెల 5న సోమవారం 95 కిలోల రాగి తీగ, అందులో అమర్చిన 15 కిలోల ప్లేట్లు దొంగతానికి గురయ్యాయని అన్నారు. దీనిపై లిఫ్టు ఇరిగేషన్ సూపర్‌వైజర్ శ్రీకాంత్ ఫిర్యాదు చేశారని తెలిపారు. మరుసటి రెజు మంగళవారం తెల్లవారు జామున మళ్లీ ఎత్తి పోతల పథకంలో రాగి తీగను దొంగలించేందుకు మహారాష్ట్ర చంద్రాపూర్‌కు చెందిన ఐదుగురు ముఠా సభ్యులు వచ్చారని చెప్పారు. అప్పటికే అక్కడ మాటు వేసి కాపలాగా ఉన్న వాచ్‌మెన్ మరో నలుగురు వెంటనే వారిని పట్టుకునే ప్రయత్నం చేశారని అన్నారు. ఈ ప్రయత్నంలో ఇద్దరు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారని అన్నారు. మరో ముగ్గురు నదిలో దూకి పారిపోయారని అన్నారు. పట్టుబడిన నిందితులు డాన్‌సింగ్, గణేశ్ సోలంకిలను పోలీసులకు అప్పగించారని తెలిపారు. దీంతో పోలీసులు విచారణ జరపగా వారితో పాటు మరో ముగ్గురు రాజు సాహు, లలాజోల్ సాహు, సతీష్ సీతారాంలు ఉన్నట్లు తెలిపారని సీఐ చెప్పారు. వీరి నుంచి పూర్తి వివరాలు సేకరించగా గత నెలలో మూడు సార్లు రాగి తీగ దొంగలించాలని వచ్చినప్పటికీ అప్పుడు సాధ్యం కాలేదని చెప్పారని అన్నారు. సిర్పూర్(టి) మండలం హుడ్కిలి ఎత్తి పోతల పథకం మోటర్ల వద్ద సైతం దొంగతనం చేసింది తామేనని అంగీకరించినట్లు సీఐ తెలిపారు. ఈ ముఠా తెలంగాణతో పాటు మహారాష్ట్రలలోనూ పలు చోట్ల దొంగతనాలకు పాల్పడినట్లు తేలిందన్నారు. దొంగలించిన సొత్తును మహారాష్ట్రలోని చంద్రాపూర్‌లో విక్రయించినట్లు తెలిపారు. రన్‌వెల్లి ఎత్తి పోతల పథకంలో దొంగిలించిన రాగి తీగను స్వాధీనం చేసుకుని ఈ ముఠా వినియోగించిన స్కూటీ, స్పెండర్ బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ చెప్పారు. దొంగలించబడిన రాగి తీగ విలువ రూ.125 లక్షలు ఉంటుందని తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా కొత్త వ్యక్తులు కనిపించినా, అనుమానాస్పదంగా తిరిగినా వెంటనే సమాచారం అందించాలని ఆయన సూచించారు. ఆయన వెంట చింతలమానేపల్లి ఎస్సై నరేశ్ ఉన్నారు.

సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి

కాగజ్‌నగర్, మే 6 (ఆంధ్రజ్యోతి): పోటీ పరీక్షలు రాసే విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి తెలిపారు. కాగజ్‌నగర్ డీఆర్సీలో విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాలిసెట్ శిక్షణ శిబిరం ముగింపు సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పోటీ పరీక్షల్లో రాణించాలంటే వివిధ అంశాలపై పట్టు పెంచుకోవాలన్నారు. ఒక్కమార్కు తేడాతో వేలల్లో ర్యాంకుల్లో మార్పు వస్తోందన్నారు. జిల్లా సైన్స్ అధికారి మధూకర్ మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉచితంగా పాలిటెక్నిక్ పరీక్షపై శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. ఎంఈవో ప్రభాకర్ మాట్లాడుతూ ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకొని ర్యాంకులు సాధించాలని చెప్పారు. ఉచిత కోచింగ్ శిక్షణకు సహరించిన ఉపాధ్యాయ బృందానికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పాలిటెక్నిక్ అధ్యాపకుడు రామదాసు, ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ, తాటి రవీందర్, దుర్గం మోహన్, సాబీర్, తిరుపతయ్య, శ్రీశైలం, తవుటం శ్యాంసుందర్, త్రివేణి, శాంతికుమార్, శాంతికుమారి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల సాగు లాభాలు బాగు



ఆదర్శంగా నిలుస్తున్న గంగాపూర్, కొండపల్లి, నేర్పల్లి గ్రామాల రైతులు

రెబ్బెన, మే 6 (ఆంధ్రజ్యోతి): మార్కెట్‌లో డిమాం డ్‌కు అనుగుణంగా కూరగాయలు సాగు చేస్తూ రెబ్బెన మండలంలోని గంగాపూర్, కొండపల్లి, నేర్పెల్లి గ్రామాల రైతులు లాభాల బాటలో పయనిస్తున్నారు. మారుతున్న కాలన్ని బట్టి రైతులు ప్రత్యామ్నాయంగా అడుగులు వేస్తున్నారు. తక్కువ విస్తీర్ణంలో కూరగాయల పంట సాగు చేసి అధిక లాభాలు గడిస్తున్నారు రెబ్బెన మండలం గంగాపూర్, కొండపల్లి, నేర్పెల్లి రైతులు. బతుకు బండిని లాగడానికి ఉపాధి కోసం పట్టణాలకు పోకుండా, స్వయం ఉపాధి కావాలంటూ అధికారుల చుట్టు తిరుగకుండా సొంత ఊరిలోనే కూరగాయలు సాగు చేస్తూ అందరికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

మండలంలోని గంగాపూర్, కొండపల్లి, నేర్పెల్లి ప్రాంతాల్లోని రైతులు కూరగాయలు సాగు చేసేందుకు అందుబాటులో ఉండే వాగులపైనే ఆధారపడుతున్నారు. గంగాపూర్ గ్రామానికి అనుకునే గంగాపూర్ వాగు, కొండపల్లి, నేర్పల్లి ప్రాంతాల్లో ప్రవహించే కొండపల్లి వాగులే ఆయా గ్రామాల రైతులు కూరగాయాలను సేద్యం చేసేందుకు ప్రధాన వనరులుగా ఉపయోగించుకుంటున్నారు. సుమారు 200 ఎకరాల్లో కూరగాయలు, ఇతర పంటలు సాగు చేస్తారు. ఇందులో అత్యధిక మంది రైతులు కూరగాయల సాగునే ఎంచుకున్నారు. గ్రామానికి ఆనుకునే వాగులు ప్రవహిస్తుండంతో రైతులకు సాగునీటి సమస్య పెద్దగా లేదు. పలువురు వాగు నుంచి మోటార్ల ద్వారా నీటిని తమ పంటలకు మళ్లించుకొని కూరగాయల పంటలను సాగు చేస్తున్నారు. కొంత అతికొద్ది మంది రైతులు మాత్రం బోర్లు, పాత కాలం నాటి బావులు ఉపయోగించి పంటలను కూరగాయాలను పండిస్తున్నా రు. ప్రణాళికాబద్ధంగా సీజన్ వారీగా డిమాండ్ తగినట్లుగా కూరగాయలు సాగు చేస్తుంటారు.



మిరప, క్యాబేజీ..

ఈ ప్రాంత రైతులు మిరప, టమాట, క్యాబేజీ, చిక్కుడు, వంకాయ, బెండకాయ, కాలీఫ్లవర్, ముల్లంగి వంటి కూరగాయాలు సాగు చేస్తున్నారు. ఇక తీగజాతుల్లో బీర, కాకర, సోరకాయ, పొట్ల, బుడమ సాగు చేస్తున్నారు. వీటితో పాటు తోట కూర, పాల కూర, గోంగుర, మెంతి, కొత్తమీర, పుదీనా, చుక్కకూర, బచ్చలికూర పండిస్తున్నారు. ఇంచు మించు అన్నీ సీజన్‌లో కూరగాయల సాగు కొనసాగించడం ఇక్కడి రైతుల ప్రత్యేకత. దీనికి తోడు రసాయనిక ఎరువులు తక్కువగా వినియోగిస్తున్నారు. వీరు పండించే కూరగాయలు తాజాగా ఉండడంతో మార్కెట్‌లో మంచి డిమాండు ఉంది.

ఇక్కడి వచ్చిన ఆకు కూరల దిగుబడిని కాగజ్‌నగర్, మంచిర్యాల, తాండూరు, బెల్లంపల్లి, మందమర్రి, పెద్దపల్లి, గోదావరిఖని, చంద్రాపూర్ వరకు తరలిస్తూ విక్రయిస్తున్నారు. ఎక్కువగా దిగుబడి ఉంటేనే దూర ప్రాంతాలకు వెళుతుంటారు. తక్కువగా ఉంటే దగ్గరగా ఉన్న మార్కెట్‌కే తరలిస్తున్నారు. కాపు కొన్సిన మొదట్లో రోజుకు ఖర్చులు పోసూ వెయి రూపాయలు మిగులుతాయని చెబుతున్నారు. కాగజ్‌నగర్ మార్కెట్ సుమారు 20 కిలో మీటర్ల లోపే ఉంటుంది. దీంతో తక్కువ పంట ఉన్న సమయంలో అక్కడికే తరలిస్తున్నారు. రవాణా ఖర్చులు కూడా తక్కువ పడుతుండడంతో లాభాదాయకంగా ఉంటుందని చెబుతున్నారు. రోజు వారీ ఆదాయం ఉంటుందని తెలిపారు.

డిమాండును బట్టి సాగు..

లెండుగురే పద్మాకర్, గంగాపూర్



మార్కెట్‌లో డిమాండుతో పాటు కాలాన్ని బట్టి కూరగాయలు పండిస్తున్నాం. ఏ కాలంలో ఏ కూరగాయలు సాగు చేయాలన్న దానిపై స్పష్టత వచ్చింది. దీంతో టమాట, వంకాయ, మిరప, చిక్కుడ, అలుసంద, బెండ, బీర, కొత్తిమీర, తోటకూరలను సాగు చేస్తున్నాం. దిగబడులు బాగు న్నాయి. రోజూ వారీ ఆదాయం ఉంటుంది. కష్టపడితే కూరగాయల సాగు లాభసాటిగా ఉంటుంది.

కూరగాయల సాగుతో లాభం..

లెండుగురే ఇస్తారి, గంగాపూర్



ఇతర పంటలతో పోలిస్తే కూరగాయల సాగుతోనే అధిక లాభాలు వస్తున్నాయి. సమీపంలో వాగు ప్రహిస్తుండడంతో మా గ్రామస్థులంతా కూడా కూరగాయల సాగుపైనే దృష్టి సారించారు. మార్కెట్‌లో డిమాండు ఉంది. తోట, పాలకూర చాలా అమ్ముడుపోతున్నాయి. వ్యాపారులు వంకాయ, బెండకాయి, కాకరకాయలకు ఇక్కడి నుంచే ముందస్తుగా లోడ్ చేసుకొని వెళుతున్నారు. ఉమ్మడి జిల్లాతో పాటు మహారాష్ట్రలో కూడా ఇక్కడి కూరగాయలకు మంచి డిమాండ్ ఉంది.

అనారోగ్యంతో వివాహిత ఆత్మహత్య

హాజీపూర్, మే 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన వివాహిత గురిజాల మనీష(25) ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. పాత మంచిర్యాలకు చెందిన గురిజాల మనీష కొంతకాలంగా తీవ్ర నడుమునొప్పితో బాధపడుతోంది. రెండు నెలల క్రితం హాజీపూర్‌లోని తల్లిగారి ఇంటికి వచ్చింది. సోమవారం రాత్రి ఇంట్లోని సీలింగ్ ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలికి రెండు సంవత్సరాల కుమారుడు ఉన్నాడు. మృతురాలు మనీష తల్లిదండ్రి బొల్లిశెట్టి అంజయ్య ఇచ్చిన మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సరూఫ్‌రాజ్ తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

నస్పూర్, మే 6 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సుందరయ్య కాలనీలోని ఓ వ్యక్తి ఇంట్లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో మంగళవారం దాడి చేసినట్లు ఎస్సై ఉపేందర్ రావు తెలిపారు. ఆరుగురు వ్యక్తులను పట్టుకుని 26,770 రూపా యల నగదు, ఆరు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేశామని తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గొర్ల కాపరిని బెదిరించిన ఇద్దరిపై కేసు

నెన్నెల, మే 6 (ఆంధ్రజ్యోతి): గొర్ల కాపరిని బెదిరించిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. భీమిని మండల కేంద్రానికి చెందిన గొర్ల కాపరి మురికి కత్తెరయ్య తన గొర్రెలమంద కోసం చెన్నూరు మండలం అస్నాద్ గ్రామానికి బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో నెన్నెల కస్తూర్బా పాఠశాల వద్దకు రాగానే బట్వాన్‌పల్లికి చెందిన జాడి సాగర్, మరొక వ్యక్తి కలిసి బైక్‌ను అడ్డగించారు. కత్తెరయ్యకు, అతని తమ్ముడికి ఉన్న భూ వివాదం గురించి ప్రస్తావించి దూర్భాష లాడారు. తనను దుర్భాషలాడినట్లు బాధి తుడు కత్తెరయ్య ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

కుక్కల దాడిలో జింక మృతి

బెల్లంపల్లి, మే 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గోల్‌బంగ్లా వద్ద మంగళవారం కుక్కల దాడిలో జింక మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. ఐటీడీఏ తోటల నుంచి జింకపిల్ల వస్తున్న క్రమంలో వీధి కుక్కలు దాడి చేయడంతో జింకపిల్ల మృతి చెందినట్లు తెలిపారు. అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

కెరమెరి, మే 6 (ఆంధ్రజ్యోతి): పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను మంగళవారం బాధితుడికి ఎస్సై మధుకర్ అప్పగించారు. మండలంలోని సాంగ్వీ గ్రామానికి చెందిన మొహర్లె పవన్ కళ్యాణ్ తన మొబైల్ ఫోన్ గత నెల 22న కెరమెరికి వెళ్తుండగా పడిపోయింది. దీంతో అతడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ టెక్నాలజీతో ఫోన్‌ను స్వాధీన పర్చుకుని మంగళవారం ఎస్సై మధుకర్ అంద జేశారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తులు చేసుకోవాలి

ఆసిఫాబాద్‌రూరల్, మే 6(ఆంధ్రజ్యోతి): ధూపదీప నైవేద్యం పథకంలో చేరేందుకు ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్‌లోని నిబంధనల మేరకు ఈ నెల 24 లోపు దరఖాస్తులు చేసుకోవాలని డీడీఎన్ సంఘం జిల్లా అధ్యక్షుడు శిరీష్‌శర్మ మంగళ వారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో 15 ఏళ్ల క్రితం నిర్మించిన ఆయాలకు అవకాశం ఉందని పేర్కొన్నారు. నిబంధనలు పాటించాలని సూచించారు. వివరాలకు 9494934924 నంబరులో సంప్రదించాలని కోరారు.

ఆర్టీసీ కార్మికుల సమ్మె వాయిదా

ఆసిఫాబాద్, మే 6 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికులు తలపెట్టిన సమ్మె తాత్కాలికంగా వాయిదా పడినట్లు ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి ఉపేందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌తో జేఏసీ నాయకులతో జరిగిన చర్చలు సఫలం కావడంతో సమ్మె వాయిదా వేసినట్లు తెలిపారు.

గ్రంథాలయాలకు పక్కా భవనాలు నిర్మిస్తాం



రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్, ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న యువకులు

సిర్పూర్(టి), మే 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రంథాలయాల భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేసి పనులు పూర్తయ్యేలా చూస్తామని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ రియాజ్ అన్నారు. మండల కేంద్రంలోని సివిల్ సప్లయి గోదాంలో నిర్వహిస్తున్న గ్రంథాలయాన్ని మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సిర్పూర్(టి) చాలా వెనకబడి ఉన్న ప్రాంతమని చెప్పారు. గ్రంథాలయాలకు పక్కా భవనాలు నిర్మిస్తే గ్రామీణ ప్రాంత యువకులు గ్రంథాలయాలకు వచ్చి లబ్ధి పొందుతారన్నారు. భవనం నిర్మించేందుకు స్థలం ఉంటే నిధుల మంజూరుకు కృషి చేస్తానని అన్నారు. ప్రస్తుతం ఉన్న తాత్కాలిక గ్రంథాలయాన్ని ఖాళీగా ఉన్న ప్రభు త్వ భవనంలోకి మార్చాలన్నారు. ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు మాట్లాడుతూ నియోజ కవర్గంలో అన్ని గ్రంథాలయాలకు నిధులు మంజూరు చేయాలని కోరారు. స్పందించిన ఆయన నిధుల మంజూరుకు కృషి చేస్తామన్నారు. ఆయన వెంట ఎంపీడీవో సత్యనారాయణ, ఈవో తిరుపతి, గ్రంథాలయాధికారులు వెంకటరమణ, సదానందం, ప్రవీణ, నాయకులు లావణ్య, విలాస్, నానయ్య, సాయి, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

ఇన్సెంటివ్‌లు అందజేయాలి

శ్రీరాంపూర్, మే 6 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ ఓసీపీ, శ్రీరాంపూర్ సీహెచ్‌పీల కోడ్‌లను విభజిస్తూ అందులో పనిచేస్తున్న ఉద్యోగులకు ఇన్సెంటివ్‌లు అందించాలని ఏఐటీయూసీ నాయకులు కోరారు. ఈ మేరకు శ్రీరాంపూర్‌కు వచ్చిన డైరెక్టర్(ప్రాజెక్ట్, ప్లానింగ్, పా) కె. వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందించారు. అనంతరం యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా మాట్లాడుతూ, 2024 నవంబర్‌లో డైరెక్టర్(పా) స్థాయిలో నిర్వహించిన సమావేశంలో ఓసీపీ-3 411, సీహెచ్‌పీ-3492ల విభజనకు యాజమాన్యం అంగీకారం తెలిపిందన్నారు. అయినా ఇప్పటివరకు అమలు చేయడం లేదన్నారు. కార్యక్రమంలో జీఎం కమిటీ సభ్యులు బద్రి బుచ్చయ్య, గొల్లపల్లి రాంచందర్, ఫైనింగ్ స్టాఫ్ ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, ఏరియా కార్యదర్శి మూడ సుధాకర్, పిట్ కార్యదర్శులు మోతె లచ్చన్న, బొడ్డు సందీప్ పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్ పెంచాలి

శ్రీరాంపూర్, మే 6 (ఆంధ్రజ్యోతి): తమకు పెన్షన్‌ను పెంచాలని, మెరుగైన వైద్య సదుపాయం కల్పించాలని సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సింగరేణి బీఐఎఫ్ఆర్‌లోకి వెళ్లిన సమయంలో తాము ఎంతో శ్రమ చేసి కంపెనీని తిరిగి మెరుగైన స్థితిలోకి తీసుకొచ్చామని తెలిపారు. గతంలో తమకు చేసిన వాగ్దానాలు అమలు చేసేందుకు సీఎండీని ఆ దేశించాలని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రాంచందర్‌రావు, ప్రధాన కార్యదర్శి బూపెల్లి బానయ్య, ఉప ప్రధాన కార్యదర్శి వేణు మాధవ్, తదితరులు ముఖ్యమంత్రిని కోరారు.

బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకోవాలి

శ్రీరాంపూర్, మే 6 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకోవాలని సింగరేణి డైరెక్టర్(ప్రాజెక్ట్, ప్లానింగ్) కె వెంకటేశ్వర్లు అన్నారు. శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలో మంగళ వారం ఆయన బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనపై శ్రీరాంపూర్ జీఎం ఎం శ్రీనివాస్‌తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం మాట్లాడు తూ శ్రీరాంపూర్ ఓసీపీలో ఓబీ ఉత్పత్తి లక్ష్యం 320 లక్షల క్యూబిక్ మీటర్లు, ఇందారం ఓబీ ఉత్పత్తి లక్ష్యం 240 లక్షల క్యూబిక్ మీటర్లుగా నిర్ణయించినట్లు చెప్పారు. ఈ లక్ష్యాలను సాధించేందుకు కాంట్రాక్టర్లు కృషి చేయాలని సూచించారు. ఓబీ తొలగింపు అధికంగా ఉంటే బొగ్గు ఉత్పత్తి, రవాణా కూడా అలాగే ఉంటుందని పేర్కొన్నారు. దీనికి అవసరమైన యంత్ర సామగ్రిని సమకూర్చుకోవాలని, పని గంటల పెంపు కోసం కృషి చేయాలన్నారు. శ్రీరాంపూర్ ఓసీపీకి 35 లక్షల టన్నులు, ఇందారం ఓసీపీకి 15 లక్షల టన్నులు బొగ్గును వార్షిక లక్ష్యంగా నిర్ణయించామని తెలిపారు. సమావేశంలో ఎస్‌ఓ టు జీఎం సత్యనారాయణ, శ్రీరాంపూర్, ఇందారం ఓసీపీల ప్రాజెక్ట్ అధికారులు శ్రీనివాస్, ఏవీరెడ్డి, సర్వే అధికారులు రామ్మో హన్, దావూద్, సీఆర్ఆర్, జీవీఆర్, వారాహి ఓబీ కాంట్రాక్టు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



సమీక్ష నిర్వహిస్తున్న డైరెక్టర్ వెంకటేశ్వర్లు

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి



సమ్మె నోటీసు అందజేస్తున్న నాయకులు

శ్రీరాంపూర్, మే 6 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికులు ఈ నెల 20న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ అన్నారు. రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో జీఎం (పర్సనల్, పీఎం అండ్ ఐఆర్) కవితానాయుడు కు మంగళవారం సమ్మె నోటీసు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను 4 కోడ్లుగా విభ జించి అమలు చేసే ప్రయత్నం చేస్తోందన్నారు. ఈ ప్రయత్నాన్ని నిరసిస్తూ దేశవ్యాప్తంగా అన్ని కార్మిక సంఘాలు మే 20వ తేదీన సమ్మె చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు ప్రధాన కార్యదర్శి మిర్యాల రంగ య్య, ఉప ప్రధాన కార్యదర్శులు కె. సారయ్య, కందికట్ల వీరభద్రయ్య, ముష్కె సమ్మయ్య, వై.వీ.రావు, మడ్డి ఎల్లాగౌడ్, కేంద్ర కార్యదర్శి వంగ వెంకట్, నాయకులు రమణమూర్తి, మల్లికార్జున్, వీరస్వామి, పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో..

కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ జీఎం ఎం. శ్రీనివాస్‌కు సమ్మె నోటీసు అందించారు. కార్యక్రమంలో బ్రాంచ్ అధ్యక్షుడు గుల్ల బాలాజీ, నాయకులు చీఫ్ ఆర్గనైజర్ వెంగళ శ్రీనివాస్, పెరుక సదానందం, సాయిళ్ల శ్రీనివాస్, సిరికొండ శ్రీనివాస్, ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.



ఓపెన్‌కాస్టు గనిని ప్రారంభించాలి

మందమర్రి టౌన్/శ్రీరాంపూర్, మే 6 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు నియోజకవర్గంలో ఓపెన్‌కాస్టు గనిని ఏర్పాటు చేయాలని ఐఎన్టీయూసీ కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు, క్రమ శిక్షణ కమిటీ చైర్మన్ కాంపెల్లి సమ్మయ్య తెలిపారు. స్థానికంగా మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పదేళ్ల క్రితం చెన్నూరులో రెండు భూగర్భ గనులను ప్రారంభించారని చెప్పారు. అర్ధాంతరంగ వాటిని మూసివేశారని అన్నారు. ఆ గనుల్లో అపారమైన బొగ్గు నిక్షేపాలు ఉన్నాయని తెలిపారు. వాటితో పాటు మరో గని ప్రారంభానికి సన్నాహాలు చేసి విరమించుకున్నారని చెప్పారు. ప్రస్తుతం సంస్థ ఇబ్బందుల్లో ఉన్న నేపథ్యంలో తప్పకుండా ఓసీని ఏర్పాటు చేయడం ద్వారా మూడు దశాబ్దాల పాటు బొగ్గు లభించే అవకాశం ఉందని చెప్పారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టాలి

కాసిపేట, మే 6 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని ఏఐటీయూసీ కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు మిట్టపల్లి వెంకటస్వామి అన్నారు. కాసిపేట 1వ గనిపై మంగళవారం నిర్వహించిన గేటు మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. కార్మికులు పోరాటాల ద్వారా తెచ్చుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్రం నాలుగు కోడ్‌లుగా చేసిందన్నారు. కార్మికుల హక్కులను కాలరాస్తుం దని చెప్పారు. ఈ విధానాలను ఏఐటీయూసీ తీవ్రంగా ఖండిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచి ఇన్‌చార్జి చిప్ప నర్సయ్య, కార్యదర్శి నాగమల్లేశ్, బ్రాంచి ఉపాధ్యక్షుడు వెంకటస్వామి, కాసిపేట గనిపిట్ కార్యదర్శి మీనుగు లక్ష్మీనా రాయణ, రాజేందర్, పార్వతి సురేశ్, చౌడ లింగయ్య, సంపత్, అనిల్, రంజిత్ కుమార్, అశోక్, గణేశ్ పాల్గొన్నారు.

కేంద్ర విధానాలకు నిరసనగా టోకెన్ సమ్మె

మందమర్రి టౌన్, మే 6(ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాల కు నిరసనగా ఈ నెల 20న తలపెట్టిన టోకెన్ సమ్మె విజయవంతానికి కార్మికు లు కలిసి రావాలని హెచ్ఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ అన్నారు. స్థానికంగా మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కార్పొరేట్ పెట్టుబడిదా రుల ప్రయోజనాల కోసం బొగ్గు పరిశ్రమలను నిర్వీర్యం చేసే ప్రక్రియకు పూనుకుంటు న్నదని అన్నారు. కేంద్రం ఇష్టారీతిన చట్టాలను మార్చుకుంటూ వస్తుందని చెప్పారు. లేబర్ కోడ్‌లు తెస్తే కార్మికుల ఉనికికే ప్రమాదమని అన్నారు. దీన్ని అడ్డుకునేందుకు పోరాడుతామని తెలిపారు.

విరివిగా మొక్కలు నాటాలి



అధికారులకు సూచనలు ఇస్తున్న మోహన్‌చంద్ర

జైపూర్, మే 6 (ఆంధ్రజ్యోతి): ఎస్టీపీపీ ప్రాంతంలో మొక్కలను విరివిగా నాటాలని సింగరేణి ఫారెస్టు అండ్ ఎన్విరాన్‌మెంట్ సలహాదారుడు మోహన్‌చంద్ర పర్గేయిన్ సూచించారు. మంగళవారం ఎస్టీపీపీ జీఎం శ్రీనివాసులుతో కలిసి పవర్ ప్లాంట్‌లోని 2 టీఎంసీ రిజర్వాయర్‌ను, నీటి కుంటలను, రక్షిత అడవులను ఆయన తనిఖీ చేశారు. నేల స్వభావాన్ని బట్టి మొక్కలను నాటాలని సూచించారు. అనంతరం నూతన 800 మెగావాట్ల ప్లాంట్ నిర్మాణాన్ని, సోలార్ ప్లాంట్‌ను, ఫ్లోటింగ్ సోలార్‌ను సందర్శించారు. కార్యక్రమంలో ఎస్టీపీపీ అధికారులు శ్రీనివాస్, అజాజుల్లాఖాన్, వాసుదేవమూర్తి, చంద్రమణి పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

భీమిని, మే 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల ఆశ్రమ పాఠశాలలో మొదటి సంవత్సరం ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని ప్రత్యేకాధికారి శారద ఒక ప్రకటనలో తెలిపారు. సీఈసీ ఇంగ్లీష్ మీడియంలో 40 సీట్లు ఖాళీలు ఉన్నాయన్నారు. ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, పదోతరగతి మెమో జిరాక్స్‌ను దరఖాస్తు ఫారానికి జత చేసి పాఠశాలలో సమర్పించాలని సూచించారు.

అంతిమ సంస్కారాలకు అవస్థలు

- అయితే గోదావరి లేకుంటే బతుకమ్మ వాగు
- పట్టణంలో వైకుంఠ ధామం నిర్మించకపోవడంతో ప్రజల పాట్లు



గోదావరి నది తీరంలో దహన సంస్కారాలు నిర్వహిస్తున్న కుటుంబసభ్యులు

చెన్నూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): అంతిమ సంస్కారానికి పట్టణ వాసులకు అవస్థలు తప్పడం లేదు. అయితే గోదావరికి లేదంటే బతుకమ్మ వాగుకు తీసుకువెళ్లి అంతిమ సంస్కారాలు నిర్వహిస్తున్నారు. ఇటు గోదావరి కానీ అటు బతుకమ్మ వాగు కానీ పట్టణానికి దూరంగా ఉండడంతో ఆఖరి మజిలీకి అవస్థలు పడుతున్నారు. పట్టణంలో వైకుంఠ వాహనం ఉన్నప్పటికీ గోదావరిలో నీరు అవతల ఒడ్డుకు ఉండడంతో ఇసుకలో ఫోర్ వీలర్ వాహనంతో నీటి వరకు చేరుకోవడం అదనపు భారంగా మారుతోంది. మృతుడి బంధువులు, కుటుంబీకులు గోదావరి ఇసుకలో సుమారు కిలోమీటరున్నర మేర నడవడం ఇబ్బందిగా ఉంటోంది. దహన సంస్కారానికి కట్టెలను గోదావరి వరకు ఎండ్లబండ్లలో తీసుకువెళ్లడం అదనపు భారంగా మారుతోంది. అదే ఇవతలి ఒడ్డు వైపు నీటిప్రవాహం ఉంటే కట్టెలు అక్కడకు పంపించడానికి రెండు వేల రూపాయలు ఖర్చు అవుతుండగా ఇసుకలో అవతలి ఒడ్డు వైపు కట్టెలు తరలించడానికి ఒక్కో బండికి నాలుగు వేల రూపాయలు ఖర్చవుతుందని పట్టణ ప్రజలు పేర్కొంటున్నారు. బతుకమ్మ వాగు వద్దకు వెళ్లినా ఇదే అదనపు భారం పడుతుండగా దహన సంస్కారాలకు మూడింతల రెట్టింపు వ్యయం అవుతుందనే అభిప్రాయాలు ఉన్నాయి.

వైకుంఠ ధామం ఏది?

మండలంలోని పలు గ్రామాల్లో గ్రామానికి ఒక వైకుంఠ ధామం నిర్మించినా అనువుగాని చోట నిర్మాణాలు చేపట్టడంతో ప్రయోజనం లేకుండా పోయిందనే విమర్శలు ఉన్నాయి. కానీ పట్టణంలో ఇంత వరకు వైకుంఠ ధామం నిర్మించకపోవడంతో పట్టణ ప్రజలకు పాట్లు తప్పడం లేదు. 2018, 2019లో పల్లె ప్రగతిలో భాగంగా ప్రతీ గ్రామంలో వైకుంఠధామం నిర్మాణానికి అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం 12 లక్షల రూపాయల చొప్పున మంజూరు చేసింది. పట్టణంలో వైకుంఠధామం నిర్మాణానికి ప్రభుత్వ స్థలం దొరక్కపోవడంతో ప్రైవేటు వ్యక్తుల వద్ద భూమి కొనుగోలు చేసి నిర్మాణం చేపట్టేందుకు ఆనాటి పాలకులు, అధికారులు నిర్ణయించారు. ఓ ప్రైవేటు వ్యక్తి వద్ద 18 లక్షల రూపాయల మున్సిపాలిటీ నిధులతో కొనుగోలు చేసేందుకు అధికారులు నిర్ణయించారు. అంతేకాకుండా సదరు భూ యాజమాని కుటుంబంలోని ఒకరికి మున్సిపల్ కార్యాలయంలో అవుట్ సోర్సింగ్ ద్వారా ఉద్యోగం కల్పించేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా భూమి కొనుగోలుపై ముందుకు రాకపోవడం, సదరు భూయాజమానికి నిధులు చెల్లించకపోవడంతో ఈప్రతిపాదన ఆదిలోనే అటకెక్కింది. దీంతో వైకుంఠధామం నిర్మాణం కాలేదు.

అదనపు ఖర్చు: కొల్లూరి శంకర్ , చెన్నూరు



పట్టణ ప్రజలకు వైకుంఠధామం అందుబాటులో లేకపోవడంతో మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న గోదావరి నదికి వెళ్లాల్సి వస్తోంది. దీంతో అదనపు ఖర్చు పెరిగిపోతోంది. గోదావరి తీరం వరకు కట్టెలు తీసుకురావాలంటే అదనపు భారం పడుతోంది.

ఇబ్బందులు తప్పడం లేదు
బజ్జూరి సంతోష్, చెన్నూరు



చెన్నూరులో వైకుంఠధామం నిర్మించకపోవడం వల్ల పట్టణ ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గోదావరి ఒడ్డున వైకుంఠధామం నిర్మించాలి.

ఫుడ్‌జోన్‌పై నీలినీడలు

- నాలుగేళ్లుగా కొనసాగుతున్న నిర్మాణపనులు

(5వ పేజీ తరువాయి)

అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. జిల్లాలో రైతులు ఉత్పత్తి చేసిన పంటలతో స్థానికంగానే ఆహార ఉత్పత్తి జరగనుంది. రైతులు పండించిన పంటలను ఫుడ్‌జోన్‌లో ఏర్పడే పరిశ్రమలకు తరలించి ఆహార ఉత్పత్తులను తయారు చేయాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు ఫుడ్ జోన్ అందుబాటులోకి రాకపోవడంతో స్థానికంగా పండించిన పంటలను ఇతర రాష్ట్రాలకు, జిల్లాలకు రైతులు తరలిస్తున్నారు. ఫుడ్‌జోన్‌ను త్వరగా అందుబాటులోకి తెస్తే రైతులకు మేలు జరుగుతుంది.

ఆసక్తి చూపని పారిశ్రామికవేత్తలు

పట్టణంలో ఏర్పాటు చేసిన ఫుడ్‌జోన్‌లో పరిశ్రమల ఏర్పాటుకు పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపడం లేదు. పరిశ్రమల ఏర్పాటు కోసం నాలుగేళ్ల క్రితం ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు సంబంధించి ప్రక్రియ ప్రారంభించినప్పటికీ ఎవరు ముందుకు రావడం లేదు. ఫుడ్ జోన్‌లో రైసుమిల్లులతో పాటు బియ్యం వినియోగించి తయారుచేసే ఉత్పత్తులకు సంబంధించిన పరిశ్రములు, పప్పు ధాన్యాల ఉత్పత్తులు, సోయాబీన్, జిన్నింగ్ మిల్లులతో పాటు దాదాపు 36 పరిశ్రమలకు ఆన్‌లైన్ దరఖాస్తుల ద్వారా పరిశ్రమల కోసం వ్యాపారస్తులకు అవకాశం కల్పించినప్పటికీ ముగ్గురు మాత్రమే దరఖాస్తులు చేసుకున్నారు. ఇందులో.. మూడు రకాల కంపెనీల ఏర్పాటుకు వ్యాపారులు ముందుకు వచ్చారు. ఢిల్లీకి సంబంధించిన కంపెనీతో పాటు స్థానికంగా ఉండే ఇద్దరు వ్యాపారులు పరిశ్రమల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. ఫుడ్‌జోన్‌లో పరిశ్రమల ఏర్పాటు కోసం ప్రభుత్వం నుంచి ఎకరానికి రూ. 40 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. అయితే వ్యాపారస్తులు భూమి ధర రెట్టింపు ఉందనే కారణంతో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు రావడం లేదని తెలుస్తోంది. అలాగే సంబంధిత అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు సైతం ఫుడ్ జోన్‌లో పరిశ్రమల ఏర్పాటు కోసం వ్యాపారస్తులకు ఇప్పటి వరకు అవగాహన కల్పించిన సందర్భం లేదు. పూర్తిస్థాయిలో ఫుడ్ జోన్‌లో పరిశ్రమలు ఏర్పాటైతే స్థానికులతో పాటు ఇతర ప్రాంతాల వారికి ఎంతో మందికి ఉపాధి లభిస్తుంది. దీంతో పాటు స్థానిక ప్రాంతం సైతం అభివృద్ధి చెందుతుంది. కానీ సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు మాత్రం పూర్తిస్థాయిలో పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా ఫుడ్ జోన్‌లో పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేసి ప్రారంభించే విధంగా చూడాలని జిల్లా ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



పరిశ్రమల కోసం ఏర్పాటు చేసిన సబ్‌స్టేషన్

వ్యాపారస్తులు ముందుకు రావడం లేదు
మహేశ్వర్, ఫుడ్ జోన్ జోనల్ మేనేజర్

పరిశ్రమల ఏర్పాటుకు వ్యాపారస్తులు ముందుకు రావడం లేదు. ఇప్పటి వరకు ముగ్గురు మాత్రమే దరఖాస్తులు చేసుకున్నారు. ఫుడ్ జోన్‌కు సంబంధించిన పనులు 80 శాతం పూర్తయ్యాయి. పరిశ్రమల ఏర్పాటు కోసం వ్యాపారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలి. ఇతర సమాచారం కోసం సంబంధిత అధికారులను సంప్రదించాలి.

ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవాలి

భీమారం, మే 6 (ఆంధ్రజ్యోతి): రైతులు ఫార్మర్ రిజిస్ట్రీలో వివరాలను నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి కల్పన సూచించారు. మంగళవారం భీమారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఫార్మర్ రిజిస్ట్రీపై రైతులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని డిజిటల్ చేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రతి రైతుకు యూనిక్ ఐడీ గుర్తింపు సంఖ్యను ఇవ్వనుందన్నారు. భూమి ఉన్న ప్రతిరైతు వివరాలను నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సుధాకర్, ఏఈవో అరుణ్‌కుమార్ , రైతులు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్ (ఆంధ్రజ్యోతి): రైతుల గుర్తింపు కోసమే ఫార్మర్ రిజిస్ట్రీ యాప్‌లో పేర్లు నమోదు చేస్తున్నామని చెన్నూరు ఏడీఏ బానోత్ ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పులిమడుగు గ్రామంలో ఫార్మర్ రిజిస్ట్రీపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి కిరణ్మయి, ఏఈవోలు ముత్యం తిరుపతి, కనకరాజు, రైతులు పాల్గొన్నారు.

అడ్మిషన్లు తెస్తేనే ఉద్యోగం

- లేదంటే ఇంటిదారి పట్టాల్సిందే

(5వ పేజీ తరువాయి)

టార్గెట్ల కోసం గ్రామాలబాట పడుతున్నారు. మండుటెండల్లో ఇంటింటికి తిరుగుతూ తమ పాఠశాలల్లో.. విద్యార్థులను చేర్పించేలా ప్రాధేయపడుతున్నారు. తమకు తెలిసినవారి ద్వారా విద్యార్థుల ఆచూకి తెలుసుకొని, తల్లిదండ్రులు ఇంటివద్ద ఉండే సమయంలో అక్కడికి వెళ్తున్నారు. పిల్లలను తమ పాఠశాలలో చేర్పిస్తేనే తన ఉద్యోగం ఉంటుందంటూ బ్రతిమిలాడుతున్నారు. అవసరమైతే ఫీజుల్లో రాయితీ ఇప్పిస్తామంటూ తల్లిదండ్రులకు హామీలు ఇస్తూ విద్యార్థులను చేర్పించే ప్రయత్నం చేస్తున్నారు. మంచిర్యాల జిల్లావ్యాప్తంగా సుమారు 200 వరకు ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. వాటిలో దాదాపు ఎనిమిది వేల మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. జిల్లాలో ఉన్న పాఠశాలల్లో కొన్ని మినహా దాదాపు అన్నిపాఠశాలలు ఉపాధ్యాయులకు టార్గెట్లు విధిస్తూ అడ్మిషన్లు సేకరించే పనిలో నిమగ్నమయ్యాయి.

- **అడ్మిషన్ల వేటలో కార్పొరేట్ కళాశాలలు..**

ఇక ఇంటర్మీడియెట్ కాలేజీల్లో సైతం ప్రవేశాల కోసం విద్యాసంస్థలు అడ్మిషన్ల వేట సాగిస్తున్నాయి. తమ సంస్థలకు ప్రత్యేకంగా ఏజెంట్లను నియమించుకుని జిల్లాలో విస్తృతంగా ప్రచారం చేస్తుండగా.. పదో తరగతి ఫలితాలు వెలువడడంతో తల్లిదండ్రులను కలిసి ప్రవేశాల ఎర వేస్తున్నాయి. మీ పిల్లలను మా కాలేజీలో చేర్పించడానికి ఇప్పుడే సీట్ బుక్ చేసుకోండి.... మరికొద్ది రోజులైతే ఫీజు ఎక్కువగా చెల్లించాల్సి వస్తుంది అంటూ కొద్దిరోజులుగా ప్రచారం ఊదరగొడుతున్నాయి. జిల్లాలో సింగరేణి ఏరియాలు, పదోతరగతిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులను పలు రకాలుగా ఆకర్షిస్తున్నారు. తమ విద్యాసంస్థల్లో సౌకర్యాలను వివరిస్తూ అడ్మిషన్లు తీసుకోవాలంటూ కోరుతున్నారు. ఇంటర్ విద్యతో సహా ఐఐటీ, నీట్, సివిల్స్, ఇతర ఉన్నత విద్య ప్రవేశాల శిక్షణ అందిస్తామని హామీలు ఇస్తున్నారు. తమ విద్యాసంస్థల్లో అనేకమంది ఐఐటీ, ఎన్ఐటీ, నీట్ ర్యాంకులు సాధించారని చెబుతూ ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు. తల్లిదండ్రులకు ఫోన్లు, మెసేజ్‌లు, వాట్సాప్‌లో ప్రచారం చేస్తున్నారు. ఇప్పటికే కొందరు తల్లిదండ్రులు హైదరాబాద్, కరీంనగర్, వరంగల్ లాంటి దూరప్రాంతాల్లో అడ్మిషన్లు కూడా తీసుకున్నారు. మంచిపేరున్న కళాశాల్లో ముందస్తుగా చేరితేనే సీటు లభిస్తుందని, దీంతో భవిష్యత్తులో అవకాశాలు మెరుగు పడతాయనే ఆశతో అడ్వాన్సులు కూడా చెల్లించిన వారున్నారు.

- **పీఆర్‌వోల నియామకం ద్వారా....**

ఆయా సంస్థలు విద్యార్థుల అడ్మిషన్లను బట్టి కమీషన్లు ఇస్తున్నాయి. పీఆర్వోలను నియమించుకుని కొన్ని పేరున్న కార్పొరేట్ కళాశాలలు వారికి ఏడాది పొడవునా నెలవారీ వేతనాలు చెల్లిస్తున్నాయి. అడ్రసుల ఆధారంగా విద్యార్థుల ఇళ్లకు నేరుగా వెళ్తున్నారు. రూ.లక్షల్లో ఫీజులు చెబుతూ వాయిదాల సౌకర్యం కల్పించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. తమ కళాశాలల పూర్వ విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు, ప్రైవేటు పాఠశాలలు, స్థానిక కళాశాలల్లో పనిచేసే జూనియర్ లెక్చరర్లతో ప్రచారం చేయిస్తున్నారు.

బ్యాంకు సేవలపై అవగాహన

జన్నారం, మే 6 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ఆధ్వర్యంలో జన్నారం మండలంలోని కలమడుగు గ్రామంలో ఉపాధి కూలీలకు బ్యాంకు సేవలపై కేంద్రం కౌన్సిలర్ రవీందర్ మంగళవారం అవగాహన కల్పించారు. డిజిటల్ చెల్లింపులు, రుణాలు, పెన్షన్‌లు, బీమా పథకాలు, సైబర్ మోసాలు, ఏటీఎం వినియోగంపై ప్రజలకు వివరించారు. సీఎఫ్ఎల్ కౌన్సిలర్లు రవీందర్, హరీష్, నూతన్‌కుమార్ పాల్గొన్నారు.

గౌడ కులస్తులు రాజకీయాల్లో రాణించాలి

దండేపల్లి, మే 6 (ఆంధ్రజ్యోతి): గౌడ కులస్తులు రాజకీయాల్లో రాణించాలని గౌడ సంఘం మండల అధ్యక్షుడు బండి రవిగౌడ్ అన్నారు. మండలంలోని కన్నెపల్లికి చెందిన బందెల రవిగౌడ్ ఇటీవల బీజేపి మండల అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా మండల గౌడ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మండల గౌడ సంఘం ముఖ్య నాయకులు, కమిటి సభ్యులు, గౌడ కులస్థులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి మిత్రుల సాయం

లక్షెట్టిపేట, మే 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకట్రావుపేట గ్రామానికి చెందిన పురోహితుడు మునిగంటి చంద్రశేఖర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతుడితో పాటు చిన్నతనంలో దౌడేపల్లి పాఠశాలలో 1990-91వ సంవత్సరం 10వ తరగతి చదివిన మిత్రులు 50వేల రూపాయలను మృతుడి కూతురు జాహ్నవి పేరున బ్యాంక్‌లో ఫిక్స్ చేసి బాండును ఆమెకు మంగళవారం అందజేశారు.

కాంగ్రెస్‌లో భగ్గుమన్న వర్గ విభేదాలు

- కమిటీలు ప్రకటించకుండానే వెనుతిరిగిన ఇన్‌చార్జి



మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌చార్జి జంగా రాఘవరెడ్డి

కాసిపేట, మే 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ మండల సమావేశంలో వర్గ విభేధాలు భగ్గుమన్నాయి. దీంతో కార్యకర్తలు నాయకులు ఆందోళనకు గురయ్యారు. గ్రామ, మండల కమిటీలను ప్రకటించేందుకు కాంగ్రెస్ పార్టీ బెల్లంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి జంగా రాఘవరెడ్డి మండల కేంద్రానికి చేరుకోవడంతో మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు వర్గం, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వర్గీయుల మధ్య వేదిక వద్ద తీవ్ర వాగ్వాదం జరిగింది. 20 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీని నమ్ముకొని పనిచేస్తున్న సీనియర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను కాదని ఎన్నికల్లో లబ్ధి కోసం పార్టీలోకి వచ్చిన వారికి పదవులను కట్టబెడితే సహించేదిలేదని ప్రేంసాగర్‌రావు వర్గం సభ్యులకు ఆందోళనకు దిగారు. వేదికపై బెల్లంపల్లి మాజీ జడ్పీటీసీ కారుకూరి రాంచందర్, బెల్లంపల్లి మున్సిపల్ మాజీ చైర్మన్ సూరిబాబుల ఫ్లెక్సీలను పెట్టి స్థానిక సీనియర్ కాంగ్రెస్ నాయకులను అవమానించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ బెల్లంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి జంగా రాఘవరెడ్డి మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలను గుర్తించి అర్హులైన వారికి పార్టీ పదవులు కట్టబెడతామని తాత్కాలికంగా కమిటీల ఎంపిక ప్రక్రియను వాయిదా వేశారు. కార్యక్రమానికి ముందుగా జైబాపు, జైభీం, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా అంబేద్కర్ విగ్రహం నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

వేమనపల్లి, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నీల్వాయి, కేతనపల్లి, దస్నాపూర్, వేమనపల్లి గ్రామాల్లో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మాజీ జెడ్పీటీసీ సంతోష్‌కుమార్ మంగళవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. రైతుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సాబీర్ ఆలీ, నాయకులు మధు, రాజన్న, పున్నం, పురుషోత్తం, తిరుపతి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ

దండేపల్లి, మే 6 (ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా మాతృమూర్తి ఈశ్వరమ్మ వర్ధంతి పురస్కరించుకొని మేదరిపేటలో శ్రీసత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో మంగళవారం మజ్జిగ ప్యాకెట్లను ప్రయాణికులు, చిరు వ్యాపారులకు పంపిణీ చేశారు. ముందుగా ఈశ్వరమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ప్రత్యేక పూజలు చేశారు. సత్యసాయి భజన మండలి కన్వీనర్ కటుకం లింగన్న, కో కన్వీనర్ గుండ ప్రభాకర్ పాల్గొన్నారు.

లక్షెట్టిపేట(ఆంధ్రజ్యోతి): ఈశ్వరమ్మ వర్ధంతి సందర్భంగా మంగళవారం బాల వికాస్ దినోత్సవంను సమితి సభ్యులు నిర్వహించారు. కార్యక్రమంలో సమితి సభ్యులు గంప రవీందర్, రమేష్, నగదర్, శ్రీనివాస్, శంకరయ్య, ఐక్య వ్యాపార సంఘం అధ్యక్షుడు మైలారపు సుధాకర్, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ పోడేటి శ్రీనివాస్‌గౌడ్, వెంకటేశ్వర్లు, కటుకం రమేష్ పాల్గొన్నారు.

సోలార్ స్ట్రీట్ లైట్లు పంపిణీ

కోటపల్లి/జైపూర్ మే 6 (ఆంధ్రజ్యోతి) : కోటపల్లి మండలంలోని శెట్‌పల్లి, జైపూర్ మండలంలోని కాన్కూర్ గ్రామంలో తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ (టీజీఎఫ్‌డీసీ) ఆధ్వర్యంలో మంగళవారం స్ట్రీట్ సోలార్ లైట్లను సంస్థ డివిజనల్ మేనేజర్ శ్రావణి పంపిణీ చేశారు. కార్యక్రమంలో మంచిర్యాల రేంజ్ ప్లాంటేషన్ మేనేజర్ గోగు సురేష్‌కుమార్, ఫీల్డ్ సూపర్‌వైజర్‌లు రాజేష్, శ్రీనివాస్, వాచర్‌లు అచ్చన్న, సాయికిరణ్, ఓదెలు, రాకేష్, సిబ్బంది షాహిద్, సంజయ్‌లు పాల్గొన్నారు.

చెక్‌బౌన్స్ కేసులో జైలు శిక్ష

బెల్లంపల్లి, మే 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హనుమాన్ బస్తీకి చెందిన సదానందం అనే వ్యక్తికి రైల్వే కాలనీలో నివాసం ఉండే సుహాసిని అనే మహిళ ఇచ్చిన చెక్ బౌన్స్ కావడంతో బాధితుడు కోర్టుకు వెళ్లాడు. దీంతో బెల్లంపల్లి జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ముకేశ్, మంగళవారం చెక్ బౌన్స్ కేసులో సుహాసినికి ఏడాది జైలు శిక్షతో పాటు రూ.2.50లక్షలు జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో దేవయ్య తెలిపారు.

వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

జైపూర్, మే 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని డీఈవో యాదయ్య సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో సమ్మర్ క్యాంపులు నిర్వహిస్తున్న జిల్లాపరిషత్ ప్రభుత్వ పాఠశాల, ప్రైమరీ పాఠశాలను ఆయన సందర్శించారు. విద్యార్థులు క్యాంపులో ఏం నేర్చుకుంటున్నారని అడిగి తెలుసుకున్నారు. ప్రైమరీ పాఠశాల విద్యార్థులకు మ్యాథ్స్, తెలుగు అక్షరాలను రాయడం, చదవడం నేర్చుకోవాలని సూచించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెడుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని గ్రామ కార్యదర్శి ఉదయ్‌ను ఆదేశించారు. ఆయన వెంట ఉపాధ్యాయులు ఉన్నారు.

తాండూర్ (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం ఎంఈవో మల్లేశం సమ్మర్ క్యాంపులు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జూన్ 5 వరకు పాఠశాలల్లో సమ్మర్‌క్యాంపులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ క్యాంపులో పిల్లల అభ్యాసన అభివృద్ధి, గణితంలో మౌలిక సామర్థ్యాలు మొదలగు వాటిలో మెలకువలు, చిత్రలేఖనం నేర్పిస్తామన్నారు. ఉదయం 8 గంటల నుంచి 10.30 గంటల వరకు క్యాంపులు ఉంటాయన్నారు. తల్లిదండ్రులు పిల్లలను తప్పనిసరిగా క్యాంపులకు పంపించాలని సూచించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జైపూర్‌లోలో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో యాదయ్య

దండేపల్లి (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెల్కివెంకటాపూర్ ఎంపీపీఎస్ ప్రభుత్వ పాఠశాలోని సమ్మర్ క్యాంప్‌ను ఎంఈవో చిన్నయ్య ప్రారంభించారు. తాళ్లపేట ఎంపీపీఎస్ పాఠశాలోని సమ్మర్ క్యాంప్‌ను పాఠశాల హెచ్‌ఎం జగదీశ్వర్‌గౌడ్ ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం అజ్మీర శివనాయక్, ఉపాధ్యాయులు ప్రభాకర్, రామరాజు, శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

మందమర్రిటౌన్ (ఆంధ్రజ్యోతి): క్రీడలతో ఆరోగ్యం, మానసిక ఉల్లాసం, క్రమ శిక్షణ కలుగుతుందని మందమర్రి జీఎం దేవేందర్ తెలిపారు. మంగళవారం స్థానిక సింగరేణి పాఠశాల మైదానంలో వేసవి క్రీడా శిక్షణ శిబిరం ప్రారంభించి మాట్లాడారు. మందమర్రి, బెల్లంపల్లి, రామకృష్ణపూర్, సోమగూడెంలకు చెందిన పిల్లలకు వాలీబాల్, అథ్లెటిక్స్, ఫుట్‌బాల్ కోచ్‌లతో శిక్షణ ఇస్తున్నామన్నారు. అనంతరం పిల్లలకు క్రీడా సామాగ్రి అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం విజయ్‌ప్రసాద్, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, అధికారుల సంఘం అధ్యక్షుడు రమేష్, పీఎం శ్యాంసుందర్, క్రీడల గౌరవ కార్యదర్శి మాస్కుల కార్తీక్, సమన్వయకర్త శివకృష్ణ, గ్రౌండ్‌ఇన్‌చార్జీ నస్పూరి తిరుపతి పాల్గొన్నారు.

రైతులు అధైర్య పడవద్దు: డీఆర్‌డీవో



తాళ్లపేట కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌డీవో కిషన్

దండేపల్లి, మే 6(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ప్రతి గింజా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు ఎవరు అధైర్య పడవద్దని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి కిషన్ అన్నారు. దండేపల్లి మండలం గూడెం, నంబాల, వెల్గనూర్, కాసిపేట, కొండాపూర్, ధర్మారావుపేట, మదాపూర్, లింగాపూర్, నాగసముద్రం, తాళ్లపేట గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధాన్యం కుప్పలు, తూకం వేసిన బస్తాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని అరబెట్టిన తర్వాతనే కొనుగోలు కేంద్రాలకు తీసుకవచ్చి ప్రభుత్వ మద్దతు ధర పొందాలన్నారు. గన్నీ సంచుల కొరత లేకుండా సిబ్బంది పర్యవేక్షించి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలన్నారు. వెల్గనూర్‌లో రైతులు, హమాలీలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం లింగాపూర్‌లో పీపీసీ గన్ని గోదాంను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో జేఆర్ ప్రసాద్, ఐకేపీ ఏపీఎం భూపతి బ్రహ్మయ్య, సీసీలు తిరుపతిగౌడ్, సురేందర్, లావణ్య, వీవోఏలు, రైతులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం మహిళల నిరసన

వేమనపల్లి, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జిల్లెడ గ్రామంలోని బీసీ కాలనీలో నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం మహిళలు ఖాళీ బిందెలతో చెడిపోయిన చేతి పంపు వద్ద నిరసన వ్యక్తం చేశారు. మహిళలు మాట్లాడుతూ తమ కాలనీలో ఉన్న ఒకే ఒక్క చేతి పంపు ఐదు నెలల క్రితం చెడిపోయి తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడన్నారు. 40 కుటుంబాలు ఉండే ఈ కాలనీలో నీటి సమస్య ఉండడంతో తాము కిలోమీటరు దూరంలో ఉన్న వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నామని, అయినా నీరు సరిపోవడం లేదన్నారు. ఎమ్మెల్యే, అధికారులు స్పందించి తమ కాలనీలో ఇదే చోట నూతన చేతి పంపును ఏర్పాటు చేయాలని కోరారు.



చేతిపంపు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కాలనీవాసులు

క్షయరహిత సమాజం కోసం కృషి చేయాలి

- జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ సుధాకర్ నాయక్



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సుధాకర్ నాయక్

నెన్నెల, మే 6 (ఆంధ్రజ్యోతి): క్షయవ్యాధి రహిత సమాజం కోసం అందరూ కృషి చేయాలని జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ సుధాకర్ నాయక్ సూచించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ఏసీఏఫ్ శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్షయ వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స తీసుకుంటే సులువుగా నివారించవచ్చన్నారు. వ్యాధి సోకిన వారు బలవర్ధకమైన ఆహారం తీసుకుంటూ మందులు క్రమం తప్పకుండా వాడాలని సూచించారు. దీర్ఘకాలంగా దగ్గు, జ్వరం, రాత్రిపూట చెమటలు పట్టడం, ఆకలి లేకపోవడం లాంటి లక్షణాలుంటే ఆస్పత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా క్షయ వ్యాధి గురించి స్థానికులకు అవగాహన కల్పించారు. 50 మందికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. మండల వైద్యాధికారి డాక్టర్ లక్ష్మణ్, సబ్ యూనిట్ అధికారి శ్రీనివాస్, ఫార్మసీ ఆఫీసర్ నారాయణ, సీనియర్ టీబీ సూపర్‌వైజర్ శశికాంత్, సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



అంతిమ సంస్కారాలకు అవస్థలు

7

- అయితే గోదావరి లేకుంటే బతుకమ్మ వాగు
- పట్టణంలో వైకుంఠ ధామం నిర్మించకపోవడంతో ప్రజల పాట్లు



గోదావరి నది తీరంలో దహన సంస్కారాలు(ఫైల్)

ఉపాధి పనుల పరిశీలన

వేమనపల్లి, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జిల్లెడ గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను మంగళవారం ఎంపీడీవో కుమారస్వామి పరిశీలించారు. కూలీలు చేపడుతున్న నీటికుంట పనులను పరిశీలించి తగు సూచనలు చేశారు. కూలీల హాజరును పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రూ. 307 గరిష్ఠ వేతనం పొందేలా పనులను చేయాలన్నారు. జాబ్ కార్డులున్న వారు ఉపాధి పనులనఉ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం నర్సరీని పరిశీలించి మొక్కలను సంరక్షించాలని సూచించారు. ఏపీవో సత్యప్రసాద్, ఈసీ మధుకర్, క్షేత్ర సహాయకుడు నారాయణ, సాంకేతిక సహాయకుడు లక్ష్మణ్ ఉన్నారు.

భూ భారతితో సమస్యల పరిష్కారం

భీమారం, మే 6 (ఆంధ్రజ్యోతి): భూ భారతితో సమస్యలు పరిష్కారం అవుతాయని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సదానందం పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ఆరేపల్లి, బూరుగుపల్లి గ్రామాల్లో భూభారతి గ్రామ సభలను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆరేపల్లిలో 65మంది రైతులు, బూరుగుపల్లిలో 220మంది రైతులు దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

అందాల పోటీలపై ఉన్న శ్రద్ధ విద్యారంగంపై లేదు

గర్మిళ్ల, మే 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వానికి అందాల పోటీలపై ఉన్న శ్రద్ధ విద్యారంగంపై లేదని, మిస్‌వరల్డ్ అందాల పోటీలు రాష్ట్రంలో నిర్వహించవద్దని ఎస్ఎఫ్ఐ జిల్లా గర్ల్స్ కన్వీనర్ రత్నవేణి మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అందాల పోటీలు నిర్వహించడం వల్ల అమ్మాయిలపై చెడు ప్రభావం ఎక్కువ పడుతుందన్నారు. సినిమాలు, యాడ్స్ పేరుతో అమ్మాయిలతో నీచంగా ప్రమోషన్లు చేయిస్తున్నారన్నారు. అందాల పోటీలపై ఉన్న శ్రద్ధ విద్యారంగంపై లేదని, విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని, కాలేజీలు, హాస్టళ్లలో తగిన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

ఫుడ్‌జోన్‌పై నీలినీడలు..

- నాలుగేళ్లుగా కొనసాగుతున్న నిర్మాణపనులు
- పరిశ్రమల స్థాపనకు ముందుకురాని పారిశ్రామికవేత్తలు
- అందుబాటులోకి వస్తే పలువురికి ఉపాధి అవకాశాలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



అసంపూర్తిగా ఉన్న ఫుడ్‌జోన్‌కు వెళ్లే రహదారి

బెల్లంపల్లి, మే 6 (ఆంధ్రజ్యోతి): గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నాలుగేళ్ల క్రితం బెల్లంపల్లికి ఫుడ్ ప్రాసెసింగ్ జోన్ మంజూరైంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఒకే ఒక్క ఫుడ్ ప్రాసెసింగ్ జోన్ మంజూరు కావడం అది జిల్లాలోని బెల్లంపల్లికి కేటాయించడంతో స్థానికులు, జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఫుడ్ ప్రాసెసింగ్ జోన్ ఏర్పాటుతో రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరతో పాటు పలువురికి ఉపాధి అవకాశాలు, ప్రాంతం అభివృద్ధి చెందుతుందని ఆశించిన వారికి నిరాశే ఎదురవుతోంది. మంజూరైన నాలుగేళ్లయినా పనులు పూర్తిస్థాయిలో కాకపోవడం, మరో వైపు పరిశ్రమల స్థాపనకు పారిశ్రామికవేత్తలు ముందుకు రాకపోవడంతో ఫుడ్ ప్రాసెసింగ్ జోన్‌పై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. ఇది అందుబాటులోకి వస్తే స్థానికులకు ఉపాధి అవకాశాలతో పాటు ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని ఎంతోమంది ఎదురు చూస్తున్నారు. కానీ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

● నత్తనడకన నిర్మాణ పనులు

గత ప్రభుత్వ హయాంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఒకే ఒక్క ఫుడ్ ప్రాసెసింగ్ జోన్‌ను బెల్లంపల్లిలో ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. బెల్లంపల్లిలో ప్రభుత్వ భూములు ఎక్కువగా ఉన్నాయని మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అప్పటి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఫుడ్ ప్రాసెసింగ్ జోన్ ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్ వచ్చింది. పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాల వెనకాల సర్వే నంబరు 170లో 350 ఎకరాల స్థలాన్ని సంబంధిత అధికారులు కేటాయించారు. ఈస్థలంలో పరిశ్రమల కోసం రహదారులు, వంతెనలు నాణ్యతతో నిర్మించకపోవడంతో వర్షాకలంలో వరదలకు రహదారులు, వంతెనలు కొట్టుకుపోయాయి. అనంతరం దాదాపు రూ. 50 కోట్ల నిధులతో ఫుడ్ జోన్‌ల ఏర్పాటు చేసే పరిశ్రమల కోసం 100 ఫీట్ల రహదారులు, విద్యుత్ స్తంభాల ఏర్పాటుతో పాటు వివిధ నిర్మాణ పనులను సైతం చేపట్టారు. పరిశ్రమల కోసం చేసిన పనులే మళ్లీమళ్లీ చేయడంతో నిధులు నీళ్ల పాలు కావడంతో పాటు మరో వైపు సమయం వృధా అయ్యింది. ఫుడ్‌జోన్ ప్రాంతంలో విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రస్తుతం దాదాపు పూర్తి అయ్యింది. ఫుడ్ జోన్‌లో రహదారుల పక్కన డ్రైనేజీలు నిర్మించాల్సి ఉండగా ఇప్పటి వరకు పనులు చేపట్టలేదు. పరిశ్రమల కోసం నీటి సరఫరా చేయాల్సి ఉంటుంది. పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థ జలాల కోసం శుద్ధిచేసే ప్లాంటుతో పాటు ఘన వ్యర్థాల నిర్వహణకు అనువైన షెడ్ల నిర్మాణం చేపట్టాల్సి ఉండగా ఇప్పటి వరకు ఇందులో ఒక్కపని కూడా పూర్తి కాలేదు. ప్రధాన రహదారికి సైతం ఇటీవలనే అనుమతులు లభించడంతో ప్రస్తుతం పనులు చేపడుతున్నారు. ఇలా నాలుగేళ్లుగా ఫుడ్‌జోన్‌కు సంబంధించిన పనులు కొనసాగుతున్నాయి.

● వ్యవసాయ ఉత్పత్తుల ఆధారంగా...

జిల్లాలో రైతులు పండించే పంటల ఉత్పత్తుల ఆధారంగా ఫుడ్ ప్రాసెసింగ్ జోన్‌ను మొదటగా ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేశారు. జిల్లాలో ఎక్కువగా రైతులు వరి, పత్తి, పప్పు దినుసులు, మామిడి సాగు చేయడానికి మొగ్గు చూపుతున్నారు. ఈ పంటలకు అనుగుణంగా...

మిగతా 7లో

ఇందిరమ్మ ఇళ్ల పనులను వేగవంతం చేయాలి

● కలెక్టర్ కుమార్ దీపక్



పొక్కూరులో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

చెన్నూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పొక్కూరు గ్రామంలో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో అర్హులైన లబ్ధిదారుల జాబితాను రూపొందించాలని, జాబితాలో అర్హులు మాత్రమే ఉండాలని అధికారులను ఆదేశించారు. ప్రజలతో మాట్లాడి గ్రామంలో నెలకొన్న నీటిసమస్య వివరాలను తెలుసుకుని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల, సుందరసాలలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రహరీ నిర్మాణ పనులను పరిశీలించారు. అంతకుముందు అంగ్రాజ్‌పల్లిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. రైతులకు నీడ, తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని నిర్వాహకులను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఎంపీడీవో మోహన్, ఎంపీవో అజ్మత్ అలీ తదితరులు ఉన్నారు.

బార్ ఏర్పాటుకు డ్రా

నస్పూర్, మే 6 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి పట్టణంలో మూతపడిన బార్ స్థానంలో నూతన బార్ కోసం డ్రా పద్ధతిలో లబ్ధిదారుడిని ఎంపిక చేసినట్లు కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. నస్పూర్‌లోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో అబ్కారీ శాఖ పర్యవేక్షకుడు నందగోపాల్, ఎక్సైజ్ సీఐ గురువయ్యలతో కలిసి డ్రా పద్ధతిలో లబ్ధిదారుడిని మంగళవారం ఎంపిక చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బెల్లంపల్లిలో మూతబడిన బార్ స్థానంలో నూతన బార్ ఏర్పాటుకు నిర్వహించిన డ్రాలో గంధ్ర దీక్షిత్‌రావు ఎంపికయ్యాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, దరఖాస్తుదారులు తదితరులు పాల్గొన్నారు.

కేసులను త్వరగా పరిష్కరించాలి : డీసీపీ



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ భాస్కర్

మంచిర్యాలక్రైం, మే 6(ఆంధ్రజ్యోతి): పోలీసు స్టేషన్‌లో నమోదైన కేసులను త్వరగా పరిష్కరించాలని డీసీపీ భాస్కర్ సూచించారు. డీసీపీ కార్యాలయంలో మంగళవారం నేరాలకు సంబంధించిన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు, ఆత్మహత్యలు, దొంగతనాలు, మిస్సింగ్ కేసులపై పోలీసులతో సమీక్షించారు. కేసులను క్షుణ్ణంగా పరిశీలించి పరిశోధన త్వరగా పూర్తిచేసి కేసుల పరిష్కరించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. రోడ్డు ప్రమాదాలకు పశువులు కారణమవుతున్నాయని వాటిని గుర్తించి గోశాలలకు పంపించాలని ఆదేశించారు. దొంగతనాల నివారణకు పెట్రోలింగ్, తనిఖీలు చేయాలని సూచించారు. సమావేశంలో ఏసీపీ ప్రకాశ్, బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

రోగులకు నాణ్యమైన ఆహారం అందించాలి



రోగులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్

గర్మిళ్ల, మే 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రుల్లోని రోగులకు నాణ్యమైన ఆహారం అందించాలని డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్ సూచించారు. మంచిర్యాలలోని ప్రభుత్వ ఆసుపత్రిని మంగళవారం ఆయన సందర్శించారు. ఆసుపత్రిలోని రోగులతో మాట్లాడారు. రోగులకు అందిస్తున్న ఆహార పదార్థాల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజనంలో ఏమేమి ఇస్తున్నారని అడిగారు. 20 రకాల ప్రశ్నలు అడిగి వివరాలను నమోదు చేసుకున్నారు. అనంతరం డాక్టర్ భీష్మతో కలిసి ఆహార పదార్థాలు వండే ప్రదేశాన్ని తనిఖీ చేశారు. వండే ప్రదేశం, ఆహార పదార్థాలు ఉంచే ప్రదేశం శుభ్రంగా ఉండాలని డైట్ కాంట్రాక్టర్ కృష్ణకు సూచించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ఆహార పదార్థాలపై మూతలు ఉంచాలని, శుభ్రమైన నీటిని రోగులకు అందించాలని సూచించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాన్నారు. పప్పులు, కూరగాయలు, బియ్యం రోజువారీగా పరీక్షించి ఆహారం వండాలని ఆదేశించారు. వారానికి ఒకసారి ఆసుపత్రిలో అందిస్తున్న డైట్ సెక్షన్‌ను సమీక్ష చేయాలని ప్రోగ్రాం ఆఫీసర్ ప్రసాద్‌కు సూచించారు. కార్యక్రమంలో డాక్టర్లు భీష్మ, ప్రసాద్, బాలాజీ, లింగారెడ్డి, సీహెచ్‌వో బుక్కా వెంకటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయం

● బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్‌వెంకటస్వామి

తాండూర్, మే 6 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయమని బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్‌వెంకటస్వామి అన్నారు. మంగళవారం జై బాబు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా తాండూర్ మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తాండూర్‌లో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలందరు రాజ్యాంగ పరిరక్షణలో భాగస్వాములు కావాలన్నారు. నియోజకవర్గంలోని ప్రజలు ఏ సమయంలో అయినా తన ఇంటి తలుపు తట్టి సమస్యలను విన్నవించవచ్చని తెలిపారు. బెల్లంపల్లి నియోజకవర్గంలో అర్హులైన ప్రతీఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ కో ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్ ఫెడరేషన్ చైర్మన్ జంగ రాఘవరెడ్డి, మహిళా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు రజిత, టీపీసీసీ సభ్యుడు శంకర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నియోజవకర్గాన్ని అభివృద్ధి చేస్తా

కన్నెపల్లి (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే గడ్డం వినోద్‌వెంకటస్వామి పేర్కొన్నారు. మంగళవారం కన్నెపల్లి మండలంలో పర్యటించారు. సుర్జాపూర్ గ్రామంలో రూ. 1.20 కోట్లతో నిర్మించిన బీటీ రోడ్డును, ఎల్లారంలో రూ. 1.60 కోట్లతో నిర్మించిన బీటీ రోడ్డును ప్రారంభించారు. జన్కాపూర్ గ్రామంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం కన్నెపల్లి, భీమిని మండలాలకు చెందిన 20 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎల్లారం గ్రామంలో సన్నబియ్యం లబ్ధిదారులతో కలిసి భోజనం చేశారు. అనంతరం కన్నెపల్లి మాజీ జడ్పీటీసీ కౌటారపు సత్యనారాయణ కాంగ్రెస్ పార్టీలో చేరగా ఎమ్మెల్యే ఆయనకు కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, ఎంపీడీవో శంకర్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మాధవరపు నర్సింగరావు, కన్నెపల్లి, భీమిని మండలాధ్యక్షులు రామాంజనేయులు, లక్ష్మీనారాయణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎల్లారంతో సన్నబియ్యం లబ్దిదారులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే వినోద్



తాండూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకులు

ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య

బెల్లంపల్లి (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తామని ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో డిగ్రీ, ఇంటర్మీడియట్ అడ్మిషన్ల పోస్టర్లను విడుదల చేసి మాట్లాడారు. ఇంటర్, డిగ్రీ కళాశాలల్లో పూర్తిస్థాయి వసతులు ఉన్నాయని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దోస్తు వెబ్‌సైట్ ద్వారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్లు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కాంపెల్లి శంకర్, అధ్యాపకులు తిరుపతి, ప్రవీణ్‌కుమార్, గజెల్లి మోహన్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు నష్టపరిహారం అందించాలి

బెల్లంపల్లి, మే6(ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి ఏరియా గోలేటి వన్‌ఇంక్లైన్ ఏరియాలో పని చేస్తున్న సమయంలో తేనేటీగల దాడిలో మరణించిన బాధిత కుటుంబాలకు సింగరేణి నుంచి కాంట్రాక్టు తీసుకున్న వ్యక్తులు బాధ్యత వహించి నష్టపరిహారం చెల్లించాలని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి మణిరాంసింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. బాధిత కుటుంబానికి ఐదు లక్షల రూపాయల నష్టపరిహారం అందించాలని సూచించారు. సింగరేణి యాజమాన్యం కాంట్రాక్టర్ల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్లు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

సీఎం వ్యాఖ్యలు విచారకరం

గర్మిళ్ల, మే 6 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు విచార కరమని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శాంతికుమారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బోనస్‌లు అడగడం లేదని, సంక్షేమ పథకాలు ఆపి జీతాలను పెంచమనడం లేదని, తమకు రావాల్సిన డీఏలను ప్రకటించాలని కోరుతున్నామన్నారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కోసం 14 నెలలుగా ఎదురు చూస్తున్నామని ఈ ఆర్థిక సంవత్సరంలో క్లియర్ చేస్తామని చెప్పిన సీఎం ఇప్పుడు మాటమార్చి ప్రజల్లో ఉద్యోగులను పలుచన చేయడం సరైంది కాదన్నారు. సీఎం హోదాలో ఉండి చర్చలు, సంప్రదింపుల ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలి తప్ప కుటుంబం అంటూనే ఉద్యోగులను బజారున పడేయడం సమంజసం కాదన్నారు. ఉద్యోగులతో సత్సంబంధాలు కొనసాగించాలనే ఆలోచన ప్రభుత్వానికి ఉంటే వెంటనే సీఎం జేఏసీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

బిహార్ కార్మికుడికి నష్టపరిహారం చెల్లించాలి

మంచిర్యాలక్రైం, మే6 (ఆంధ్రజ్యోతి): రామగుండం ఓసీపీ5లో సూపర్ వైజర్‌గా విధులు నిర్వహిస్తున్న వికాస్ మృతికి యాజమాన్యం నష్టపరిహారం చెల్లించాలని ప్రజా సమస్యల పరిష్కార వేదిక కన్వీనర్ దుండె నర్సయ్య ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మృతుడి కుటుంబానికి కోటి రూపాయల నష్టపరిహారంతో పాటు ఓసీపీలో ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు.

కలెక్టరేట్ ఎదుట జర్నలిస్టుల దీక్ష

నస్పూర్, మే 6 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన జర్నలిస్టులకు డబుల్ బెడ్ రూం ఇండ్లు, ఇంటి స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేస్తూ డెమోక్రటిక్ జర్నలిస్టు ఫెడరేషన్ ఆధ్వర్యంలో నస్పూర్‌లోని కలెక్టరేట్ ఎదుట ఒక రోజు దీక్ష చేపట్టింది. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అదనపు కలెక్టర్ మోతిలాల్‌కు నాయకులు అందించారు. ఈ సందర్భంగా జర్నలిస్టు నాయకులు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలన్నారు. చాలా కాలంగా పనిచేస్తున్న వారికి ఇండ్లు, ఇంటి స్థలాలు లేదని, అర్హులైనా వారికి ఇండ్ల స్థలాలు ఇవ్వాలని, డబుల్‌బెడ్ రూం పథకంలో అవకాశం కల్పించాలన్నారు. ఈ దీక్ష కార్యక్రమంలో డీజేఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొల శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షులు వేణుగోపాల్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు మోక నపల్లి బద్రి, ప్రధాన కార్యదర్శి తిరుపతి, అధికార ప్రతినిధి కుమార్, జిల్లా కార్యదర్శి అంజనేయులు పాల్గొన్నారు.

పాకిస్థానీలను వారి దేశానికి పంపించాలి

నస్పూర్, మే 6 (ఆంధ్రజ్యోతి) : పాకిస్థాన్ పౌరసత్వం కలిగి ఉండి జిల్లాలో ఉన్న వారిని గుర్తించి వెంటనే వారి దేశానికి పంపించాలని కోరుతూ భారతీయ జనతా పార్టీ నాయకులు అదనపు కలెక్టర్ మోతిలాల్‌కు మంగళవారం వినతి పత్రం అందజేశారు.

అనంతరం జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ పాకిస్థాన్‌కు చెందిన వారు జిల్లాలో ఎవరైన ఉన్నట్లయితే వారిని వెంటనే ఆ దేశానికి పంపించేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు దుర్గం అశోక్, పట్టి వెంకటక్రిష్ణ, నాయకులు ఆరుముల్ల పోచం, ముఖేశ్ గౌడ్, రమేశ్, అమిరిశెట్టి రాజు, దీక్షితులు, మల్లీఖార్జున్, కమలాకర్ రావు, కాశెట్టి నగేశ్వర్‌రావు, జనార్ధన్, కుర్ర చక్రవర్తి, ప్రవీణ్, పిట్టల రవి పాల్గొన్నారు.

అడ్మిషన్లు తెస్తేనే ఉద్యోగం..!

- లేదంటే ఇంటిదారి పట్టాల్సిందే
- ప్రైవేట్ టీచర్లకు యాజమాన్యాల టార్గెట్లు




మంచిర్యాల, మే 6 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా పాఠశాల విద్యార్థులకు విద్యాసంవత్సరం ముగిసి, వేసవి సెలవులు వచ్చాయంటే పండుగలా భావిస్తారు. వేసవి సెలవుల్లో అమ్మమ్మ ఊరు, బంధువుల ఇళ్లకు వెళ్లేందుకు ఆరాటపడతారు.

దాదాపు నెలరో జులపాటు కుటుంబ సభ్యులతో వివిధ రకాలుగా సేదదీరుతారు...కాని ప్రైవేట్ పాఠశాలల్లో వారిని తీర్చిదిద్ది, ప్రయోజకులను చేసే ఉపాధ్యాయులకు మాత్రం వేసవి సెలవులు వస్తున్నాయంటే సరదాలు ఏమోగానీ, ఉన్న ఉద్యోగాన్ని నిలుపుకోవడం కత్తిమీద సాములా మారుతోంది. వేసవి సెలవులు వచ్చింది మొదలు....పాఠశాలలు పునఃప్రారంభం అయ్యే నాటికి అడ్మిషన్ల కోసం యాజమాన్యాలు విధించే టార్గెట్లు చేరుకొనేందుకు ఉపాధ్యాయులు పడరాని పాట్లు పడుతున్నారు. ఎండలో ఇంటింటికి తిరుగు తూ వారి పిల్లలను తమ పాఠశాలలకే పంపించేలా తల్లిదండ్రులను ప్రాధేయపడుతున్నారు.

● పోటీ పెరగడంతో....

విద్యా వ్యాపారంలో కార్పొరేట్ విద్యాసంస్థల ఆగమనం అధికం ఎక్కువకావడం, పెరుగుతున్న పోటీ ప్రపంచంలో పాఠశాలల మనుగడ కోసం యాజమాన్యాలు విస్తృతంగా ప్రచారం చేస్తున్నాయి. తమ సంస్థల్లో విద్యార్థుల ప్రవేశాలే లక్ష్యంగా పోటీ పడుతున్నాయి. ఇందుకోసం వేసవి సెలవులను అవకాశంగా వాడుకుంటున్నాయి. తమ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులకు టార్గెట్లు విధిస్తూ బలవంతంగా అడ్మిషన్లు సేకరిస్తున్నాయి. ఒక్కో టీచర్‌కు కనీసం పది మంది విద్యార్థులను చేర్పించాలంటూ హుకుంజారీ చేస్తున్నాయి. ఉపాధ్యాయులు తమ టార్గెట్లు చేరితే నే మరుసటి విద్యాసంవత్సరం కోసం తన ఉద్యోగం ఉండటంతో పాటు ఇంక్రిమెంట్ ఇస్తామంటూ ఒత్తిడి తెస్తున్నాయి. ఉన్నత చదువులు చదివి, ఇంత కాలం ఉపాధ్యాయ వృత్తిపై ఆధారపడ్డవారు బయటకు వెళ్లి ఇతరత్రా పనులు చేయలేక యాజమా న్యాలు విధిం చిన



మిగతా 7లో



WANTED

★ 7th, 10th చదివిన స్త్రీ, పురుషులు 6గురు కావలెను. వయస్సు 30సం॥ లోపు వారు ఉచిత వసతి, జీతం: 15000. సం॥ప్ర॥ 9849316058.

AJW-237183

3+2 స్కీం కలదు

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు.
పాఠకులు ఈ విషయాన్ని, ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనలకై సంప్రదించండి

మంచిర్యాల :- సెల్: 99854 11038

కాగజ్‌నగర్ :- సెల్ : 99854 08147